

నేడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాక

» 'హరిహర వీరమల్లు' ప్రీ రిలీజ్ వేడుకకు హాజరు




సిరిపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ బుధవారం నగరానికి వస్తున్నారు. ఆయన హీరోగా నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రానికి సంబంధించి ప్రీ రిలీజ్ వేడుక ఆర్కే బీచ్‌రోడ్డులోని ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాల్‌లో సాయంత్రం నాలుగు గంటలకు జరగనున్నది. ఆయనతో పాటు చిత్ర బృందం వేడుకలో పాల్గొననున్నారు.

పేదల కాలనీల్లో ప్లానింగ్ నిల్!

కానరాని మౌలిక సదుపాయాలు

» తాగునీరు, కాలువలు, రహదారులు, విద్యుత్ కనెక్షన్లపై ప్రణాళిక శూన్యం
» ముందు వెనుకా చూడకుండా ఇళ్ల నిర్మాణం ప్రారంభించిన వైసీపీ ప్రభుత్వం
» ఇప్పుడు అన్ని శాఖలను సమన్వయం చేసేందుకు కూటమి ప్రభుత్వం యత్నం



మౌలిక సదుపాయాలు లేని కాలనీ ఇళ్లు


» సామాజిక అవసరాలకు కనిపించని భూ కేటాయింపులు
» నగరానికి 30, 40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు
» దాంతో అక్కడ ఉండేందుకు ఆసక్తి చూపని అత్యధికులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పేదలందరికీ ఇళ్లు అంటూ జగన్ ప్రభుత్వం సెంటు భూమిలో చేపట్టిన గృహ నిర్మాణం ఎందుకూ కొరగాని విధంగా తయారైంది. ముందస్తు ప్రణాళిక లేకుండా వేలాది ఎకరాల్లో వేసిన లేఅవుట్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఏదోవిధంగా కూటమి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తున్నా వాటికి మౌలిక వసతులు కల్పించడం పెద్ద సవాల్‌గా మారింది. కనీస అవసరాల గురించి ఆలోచించకుండా చేపట్టిన ఈ ఇళ్లల్లో ఉండేందుకు అత్యధికులు ఆసక్తి చూపడం లేదు.

విశాఖపట్నం జిల్లాలో లక్ష మంది పేదలకు సెంటు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు వైసీపీ ప్రభుత్వం దాదాపు 5,500 ఎకరాలను సమీకరించింది. శివారు ప్రాంతాలైన పద్మనాభం, ఆనందపురం, పెందుర్తి, సబ్బవరం తదితర మండలాల్లో తోటలను తొలగించి, కొండలను కొట్టి 65 లేఅవుట్లను వేసింది. వాటిలో అతి పెద్ద లేఅవుట్లు భీమిలి నియోజకవర్గంలో ఉన్నాయి. హనుమంతవాక జంక్షన్ నుంచి 42 కి.మీ. దూరానున్న ఆనందపురం మండలం తంగేడు బిల్లిలో 700 ఎకరాల్లో ఒకేచోట 16 వేల ఇళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు చేసుకున్నారు. విశాఖ నుంచి 55 కి.మీ. దూరానున్న పద్మనాభం మండలం నరసాపురంలో ఎనిమిది వేల ఇళ్ల నిర్మాణం చేపట్టారు. విశాఖ నుంచి 35 కి.మీ. దూరానున్న సబ్బవరంమండలం పైడివాడ అగ్రహారంలో 11వేల ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఇలా అనేక లేఅవుట్లు వేశారు.

పేదలకు గృహ నిర్మాణ పథకాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం వ్యాపారంగానే పరిగణించింది. ఇళ్ల నిర్మాణ బాధ్యతలను ఆ పార్టీకి చెందిన వారికే అప్పగించింది. దాంతో నాణ్యత



ప్లానింగ్ లేకుండా నిర్మించిన కాలనీ ఇళ్లు

రాకపోకలకు నెలకు రూ.6 వేల ఖర్చు

పేదలకు ఇళ్లు నిర్మించేందుకు నగరంలో భూములు లేకపోవడం వల్ల శివారుల్లో కాలనీలు నిర్మించారు. ఇవి సగటున నగరానికి 30 కి.మీ. దూరాన ఉన్నాయి. అక్కడికి వెళ్లి రావడానికి సరైన ప్రజా రవాణా వ్యవస్థలు లేవు. పేదలు అక్కడి నుంచి రోజూ నగరంలోకి పనుల కోసం వచ్చి వెళ్లాలంటే మనిషికి రూ.200 ఖర్చు అవుతుంది. అంటే నెలకు రూ.6 వేలు. అదే భార్యాభర్తలు ఇద్దరూ పనులు చేసుకునేవారైతే వారికి నెలకు రూ.12 వేలు ఆటో చార్జీలకే అవుతుంది. దానికి బదులు రూ.6 వేలు పెట్టి నగరంలోనే ఇల్లు అద్దెకు తీసుకుంటే వారికి ఇంకో రూ.6 వేలు మిగులుతుంది. రానుపోను సమయం మిగులుతుంది. పిల్లలకు చదువులకు సౌకర్యంగా ఉంటుంది. అందుకని అత్యధికులు అక్కడికి వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు.

లేకుండా పోయింది. చాలా లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణానికి వేసిన పునాదుల కింద నుంచి అప్పట్లో వర్షంనీరు ప్రవహించింది. పునాదులు గాలిలో వేలాడాయి. వాటిపైనే నిర్మాణాలు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని పూర్తిచేసి పేదలకు అందించే బాధ్యతను తీసుకుంది. పథకం పేరును 'ఎన్‌టీఆర్ హౌసింగ్-పేదలందరికీ ఇళ్లు..పీఎంఏవై' అని మార్చింది.


లేఅవుట్లలో కేటాయింపులు ఏవి?

ఎవరైనా లేఅవుట్ వేస్తే అందులో సామాజిక అవసరాలకు అవసరమైన భూములు కేటాయించాలని వీఎంఆర్‌డీఏ చెబుతుంది. అంటే విద్యాలయాలు, ఆస్పత్రులు, గ్రంథాలయాలు, కళ్యాణ మండపాలు, బ్యాంకులు, పోస్టాఫీసులు...ఇలా అందరికీ ఉపయోగపడే వాటి కోసం తగిన భూములు మార్కింగ్ చేయాలి. సెంటు ఇళ్ల కాలనీల లేఅవుట్లను వీఎంఆర్‌డీఏనే స్వయంగా వేసింది. కానీ అందులో 'సామాజిక అవసరాలు' అంటూ కొద్దిగా ఖాళీ స్థలాలు చూపించిందే తప్ప ... మిగతా 6వ పేజీలో

గీత దాటితే... పట్టేస్తుంది

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఏఐ అస్త్రం

» పైలట్ ప్రాజెక్టుగా ఐదు కూడళ్లు ఎంపిక
» నాలుగు సంస్థలకు బాధ్యతలు అప్పగింత
» ఆయా సంస్థల నుంచి డీపీఆర్ అందాక నగరమంతా అమలు



పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన కూడళ్లు

1. అక్కయ్యపాలెం,
2. ఊర్వశి జంక్షన్, 3.ఎండాడ,
4. ఆర్‌అండ్‌బి జంక్షన్,
5. గోపాలపట్నం పెట్రోల్‌బంక్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కూడలిలో రెడ్‌సిగ్నల్ పడినా వెనుకాముందు ఆలోచించుకోకుండా దూసుకుపోయేవారి ఆటలు ఇకపై సాగవు. ఒకవేళ పోలీసులు చూడకపోయినా...జంక్షన్‌లో అమర్చిన ఏఐ టెక్నాలజీతో పనిచేసే సీసీ కెమెరాల నుంచి మాత్రం తప్పించుకోలేరు. వాహనం నంబర్, ఉల్లంఘనకు సంబంధించిన ఫొటో, సమయం, ప్రదేశం వంటి వివరాలతో ఈ-చలాన్ నేరుగా వాహన యజమాని ఇంటికి చేరిపోతోంది. అలాగే వాహనం నడుపుతున్న వ్యక్తి ముఖం ఆధారంగా అతని వివరాలు, చిరునామాను తెలుసుకుని పోలీసులకు అందజేస్తుంది.

నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలతోపాటు రోడ్డుప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు, జీవీఎంసీ సంయుక్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత రోడ్డు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ విధానం అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. అన్ని ప్రధాన కూడళ్ల వద్ద ఉన్న సీసీ కెమెరాలకు ఏఐ టెక్నాలజీని అనుసంధానం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే అన్నిచోట్ల ఒకేసారి కాకుండా పైలట్ ప్రాజెక్టుగా తొలిదశలో ఐదు కూడళ్లలో అమలు చేయాలని నిర్ణయించారు. దీనికోసం ఆసక్తి ఉన్న సంస్థలు, కంపెనీలు నుంచి ప్రతిపాదనలను జీవీఎంసీ ఆహ్వానించింది. నోయిడాకు చెందిన మెటా ఫ్యూజన్, బెంగళూరుకు చెందిన డేటాకార్ట్, హైదరాబాద్‌కు చెందిన బృహస్పతి టెక్నాలజీస్, ముంబైకు చెందిన సీఎంఎస్ కంప్యూటర్స్ సంస్థలు తమ ఆసక్తిని తెలియజేశాయి. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ సంయుక్తంగా దీనిపై చర్చించారు. ఏఐ ట్రాఫిక్స్ సిగ్నల్స్ పనితీరు, దానివల్ల కలిగే ప్రయోజనాలను ఆయా సంస్థల ప్రతినిధులు వివరించారు. ఏఐ ఆధారిత ట్రాఫిక్ సిగ్నల్ విధానం అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడేవారి వాహనాలకు సంబంధించిన ఫొటోలను తీసి, వాటి ఆధారంగా జరిమానాలను ఈ-చలాన్ ద్వారా విధించడం, ట్రాఫిక్ రద్దీని బట్టి సిగ్నల్స్ పడడం, పోలీసుల రికార్డుల్లో ఉండే పాత నేరస్థుల డేటాను అప్‌లోడ్ చేసిన సాఫ్ట్‌వేర్ ఆధారంగా వారెవరైనా రోడ్లపై కనిపిస్తే వారి ఫొటోలను తీసి సమాచారాన్ని పోలీస్ కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు చేరవేయడం, ట్రాఫిక్ రద్దీగా ఉండే రోడ్ల వివరాలను కమాండ్ ... మిగతా 6వ పేజీలో

కూటమిలో పోటీ

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్

» ఈ ఏడు నెలలూ తమనే కొనసాగించాలని మేయర్, ఎమ్మెల్యేలకు ప్రస్తుత కమిటీ సభ్యుల విజ్ఞప్తి
» ఈసారైనా తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్న టీడీపీకి చెందిన పలువురు కార్పొరేటర్లు
» నాలుగు స్థానాలు అడుగుతున్న జనసేన
» రెండింటిపై బీజేపీ పట్టు
» పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్న వైసీపీ
» నామినేషన్లకు 29 వరకూ అవకాశం



విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల కావడంతో కూటమి పార్టీల్లో హడావిడి మొదలైంది. ప్రస్తుత స్టాండింగ్ కమిటీ కాలపరిమితి వచ్చే నెల ఆరో తేదీతో ముగుస్తుండడంతో కొత్త కమిటీ ఎన్నికకు కమిషనర్ కేతన్‌గార్గ్ సోమవారం నోటిఫికేషన్ ఇచ్చారు. వచ్చే నెల ఆరున కొత్త కమిటీ ఎన్నిక నిర్వహించనున్నారు. సోమవారం నుంచే నామినేషన్ల పర్వం ప్రారంభమైంది.

జీవీఎంసీ ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం వచ్చే ఏడాది మార్చి పదో తేదీతో ముగియనున్నది. కొత్తగా ఎన్నికయ్యే స్టాండింగ్ కమిటీ పదవీకాలం కూడా అప్పటితోనే ముగుస్తుంది. ఏడు నెలలు మాత్రమే కొనసాగే కొత్త కమిటీకి మరోసారి ఎన్నికలు నిర్వహించకుండా ఏకగ్రీవంగా తమనే ఎన్నుకోవాలని ప్రస్తుత స్టాండింగ్‌కమిటీ సభ్యులు కోరుతున్నారు. తాము ఎన్నికైన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, ఆ ఆ తర్వాత జీవీఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాస తీర్మానం, కొత్త మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక వంటి ప్రక్రియల కారణంగా తమ కమిటీ కేవలం 12 సార్లు మాత్రమే సమావేశమైందని, మిగిలిన ఏడు నెలలకు తమనే కొనసాగించాలని మేయర్ పీలా శ్రీనివాసరావుతో పాటు కూటమి ఎమ్మెల్యేలను కోరారు. మరోవైపు టీడీపీ కార్పొరేటర్లు కొందరు తాము ... మిగతా 6వ పేజీలో

నకిలీ డాక్టర్ అరెస్టు

» కిడ్నీలు ఇప్పిస్తానంటూ కొందరిని, ఇచ్చేందుకు ముందుకొచ్చిన మరికొందరిని మోసగించి డబ్బులు తీసుకున్న వైనం

సీతంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ బాధితులను, కిడ్నీలు అమ్ముతానంటూ ముందుకొచ్చిన వారిని మోసగిస్తున్న నకిలీ డాక్టర్‌ను నాలుగో పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనంతపురం జిల్లా గుంతకల్లు విద్యానగర్‌లో నివాసం ఉంటున్న సయ్యద్ హనీఫ్ షా (54) తన ఫేస్‌బుక్‌లో కిడ్నీ డోనర్స్ గ్రూపు క్రియేట్ చేశాడు. అందులో తనను డాక్టర్ ఆనంద్‌గా పరిచయం చేసుకున్నాడు. ఈ క్రమంలో కొంతమందిని నమ్మించి డబ్బులు తీసుకొని ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడం లేదా బ్లాక్ చేయడం చేసేవాడు. ఇదే తరహాలో జనవరిలో అక్కయ్యపాలెంలోని బికాన్ హోటల్‌కు ఫోన్ చేశాడు. తనకు సంబంధించిన రోగులు ఒడిశా నుంచి వస్తున్నారని, రూమ్ కావాలని చెప్పాడు. డబ్బులు తానే చెల్లిస్తానన్నాడు. ఒడిశా ప్రాంతానికి చెందిన ముగ్గురు జనవరి 28న వచ్చి మూడు రోజులు ఉన్నారు. వారు డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయారు. అదే తరహాలో జూన్ 29న హోటల్‌కు ఫోన్ చేసి ఇద్దరికి రూమ్ కావాలని చెప్పాడు. 30న ఏలూరుకు చెందిన రాంబాబు, యేసు రాజు వచ్చారు. వారు ... మిగతా 6వ పేజీలో

ప్రైవేట్ ఆస్పత్రులకు కళ్లెం

ఏ చికిత్సకు ఎంత వసూలు చేస్తారనే వివరాలు రిసెప్షన్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేయాల్సిందిగా ఆరోగ్య శాఖ ఆదేశాలు

» ఆ సమాచారం అందుబాటులో ఉంచకపోయినా, అంతకుమించి వసూలు చేసినా చర్యలు
» రోగుల వద్ద నుంచి ఫిర్యాదులు వస్తే విచారణ



విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి):

"కడుపునొప్పి వస్తుందని ఆస్పత్రిలో చేరాను. శస్త్ర చికిత్సకు రూ.80 వేలు ఖర్చవుతుందని చెప్పారు. తీరా డిశ్చార్జ్ అయ్యే సమయానికి రూ.1.8 లక్షలు బిల్లు చేతిలో పెట్టారు. ముందే ఇంత మొత్తం అవుతుందని చెబితే ఆస్పత్రిలో చేరేవాడిని కాదు'...ఇదీ నగర పరిధిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో కొన్నిరోజుల కిందట శస్త్ర చికిత్స చేయించుకున్న రామారావు ఆవేదన.

నగరంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులు ఇదే తరహా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఇందుకు చెక్ చెప్పేందుకు ఆరోగ్య శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ఆస్పత్రుల్లో సేవలకయ్యే ఖర్చుల వివరాలు నోటీస్ బోర్డులో ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు. ఆస్పత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్స్‌లో రిసెప్షన్ కౌంటర్ వద్ద ఈ ధరల పట్టికను ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. ఈ మేరకు ఆస్పత్రులకు సమాచారాన్ని అందించారు. ఆస్పత్రులు, ల్యాబ్‌లలో అయితే శస్త్రచికిత్సలు, వైద్యుల కన్సల్టేషన్, పరీ క్షలకు సంబంధించిన ధరల జాబితాను, ల్యాబ్ లలో అయితే చేసే పరీక్ష, దాని ధర వంటి వివరాలను ఏర్పాటుచేయాలి. అలా ఏర్పాటు చేయని ఆస్పత్రులపై రోగులు, వారి సహాయ కులు ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేయ వచ్చు. ఆయా ఫిర్యాదులను బట్టి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2002 ప్రకారం చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఆస్పత్రులు తీరు మార్చుకోకపోతే అనుమతులు రద్దు చేసేందుకు అవకాశం ఉంది.

ఇదీ లెక్క...

జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు ... మిగతా 6వ పేజీలో

గాయత్రి మెడికల్ కళాశాలలో అడ్మిషన్లపై నిషేధం

» అనుమతుల కోసం అడ్డదారులు తొక్కినట్టు సీబీఐ నిర్ధారణ
» ఇద్దరిపై కేసు నమోదు

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని గాయత్రి మెడికల్ కళాశాలకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఝలక్ ఇచ్చింది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలపై నిషేధం విధించింది. దేశవ్యాప్తంగా ఈ తరహా చర్యలను తొమ్మిది మెడికల్ కాలేజీలపై తీసుకోగా, గాయత్రి మెడికల్ కళాశాల ఆ జాబితాలో ఉంది. దీనివల్ల సుమారు 200 సీట్లను కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చింది. గాయత్రీ మెడికల్ కాలేజీలో ఈ ఏడాది ప్రవేశాలకు సంబంధించిన సీట్ల సంఖ్యను సున్నాగా పేర్కొనడంపై వైద్య ... మిగతా 6వ పేజీలో

మంచం పట్టిన భద్రయ్యపేట

» గ్రామస్థులను వణికిస్తున్న కిడ్నీ వ్యాధి
» ఇప్పటికే వ్యాధి బారినపడి 20 మంది మృతి
» తాజాగా మరో 50 మంది బాధితులు
» కలుషిత జలాలే కారణమంటున్న స్థానికులు





కిడ్నీ వ్యాధితో మంచాన పడిన కోండ్రు నర్సయ్య, కోరాడ రాములమ్మ

పద్మనాభం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ భద్రయ్యపేటను కిడ్నీ వ్యాధి పీడిస్తోంది. కేవలం 280 మంది జనాభా నివసించే ఈ గ్రామంలో తాజాగా 160 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, 50 మందికి కిడ్నీ సమస్య ఉన్నట్టు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిర్ధారించారు. కాగా గ్రామంలో మిగిలిన వారికి ఇంకా పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా మరెంతమందిలో వ్యాధి బయటపడుతుందోననే ఆందోళన నెలకొంది. ఇదిలా ఉండగా గ్రామంలో ఇప్పటి వరకూ సుమారు 20 మంది కిడ్నీ వ్యాధితోనే మృత్యువాత పడినట్టు సమాచారం.

భద్రయ్యపేటలో కిడ్నీ వ్యాధి బారినపడుతున్న వారు తీవ్రమైన నడుమునొప్పి, నీరసం, కాళ్లు పీకులు, ఒళ్లు నొప్పులతో మంచానికే పరిమితమవుతున్నారు. దీంతో ఉపాధి లేక ఆర్థికంగా కుదేలవుతున్నారు. ఈ లక్షణాలతో ఆస్పత్రికి వెళ్లిన వారికి సీరం క్రియాటినిన్ ఎక్కువగా ఉందని నిర్ధారణ కావడంతో కేజీహెచ్‌లో మంగళవారం పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో నీరు కలుషితమవ్వడమే వ్యాధికి కారణమని తేలింది. అయితే అధికారులు తాత్కాలిక ఉపశమనంగా నీటిలో కలిపేందుకు గుళికలు ఇచ్చి ... మిగతా 6వ పేజీలో

ఏయూ హాస్టల్ విద్యార్థుల ఆందోళన



ఏయూ ప్రధాన గేటు ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు ఏయూ ప్రధానగేటు ముందు ఆందోళనకు దిగారు. వసతి గృహాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని, ఫీజుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని విద్యార్థులను వెనక్కి పంపించేందుకు యత్నించినా ససేమిరా అన్నారు. ఉన్నతాధికారులు వచ్చేంత వరకూ తాము కదిలేదని లేదని భీష్మించుకు కూర్చున్నారు. అయితే విద్యార్థులతో పోలీస్ అధికారులు చర్చలు జరపడంతో 11 గంటలకు ఆందోళన విరమించారు.

జమ్మిచెరువులో శుభ్రతకు చర్యలు



చెరువు చుట్టూ బ్లీచింగ్ చల్లుతున్న జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది

భీమునిపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : దోమలు బాధ తీరుతుందని మందు కొడితే... చెరువులో చేపలన్నీ మృత్యువాతపడిన జమ్మిచెరువులో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేశారు. జీవీఎంసీ జోన్-1 పరిధిలోని 3వ వార్డు భీమిలి జమ్మిచెరువు ఉద్యానవనంలో దోమల బాధ ఎక్కువగా ఉందని, ఈ నెల మొదట్లో జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది ఎంఎల్ ఆయిల్‌ను డ్రోన్‌తో పిచికారి చేశారు. దీంతో దోమల బాధ అటుంచితే జమ్మిచెరువులో ఉన్న చేపలు గత పది రోజులుగా చనిపోతూ నీటిపై తేలుతున్నాయి. దీంతో దోమల బాధ కన్నా చనిపోయి ఒడ్డుకు చేరుతున్న చేపలతో దుర్వాసన వస్తోందని, సందర్శకులు ఇబ్బంది పడుతున్నారంటూ ఈ నెల 21న 'ఆంధ్రజ్యోతి'లో 'జమ్మి చెరువులో చేపల మృతితో దుర్వాసన' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జీవీఎంసీ అధికారులు పారిశుధ్య సిబ్బందితో జమ్మిచెరువు ఉద్యానవనంలో మంగళవారం గ్యాంగ్ వర్క్ నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బీఎం నాయుడు, సూపర్‌వైజర్ రేగాని రవి ఆధ్వర్యంలో చెరువులో మృతి చెందిన చేపలను తొలగించి, జమ్మిచెరువు సమీపంలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లి పరిశుభ్రపరిచారు. దీంతో సందర్శకులు హర్షం వ్యక్తం చేశారు.

డీఈఈ అడ్మిషన్లకు ధ్రువపత్రాల పరిశీలన గడువు 24 వరకూ పొడిగింపు

భీమునిపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో మంగళవారంతో ముగియనున్న డీఈఈ సెట్ ధ్రువపత్రాల పరిశీలన గడువును ఈ నెల 24వ తేదీ వరకూ ప్రభుత్వం పొడిగించిందని ఆ సంస్థ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి మంగళవారం వరకూ డీఈఈ సెట్‌లో అర్హత పొంది వివిధ కళాశాలలకు అలాట్‌మెంట్ లెటర్లు అందుకున్న అభ్యర్థులకు డైట్‌లో ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. కాగా, డైట్‌కు ఇప్పటివరకూ మొత్తం 93 మంది అభ్యర్థులను కేటాయించగా, వారిలో కేవలం 42 మంది అభ్యర్థులు మాత్రమే జాయిన్ అయ్యారు. భీమిలి డైట్‌లో మొత్తం వంద సీట్లు ఉండగా, ఇంకా 58 సీట్లు భర్తీ కావాల్సి ఉంది. కాగా, ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈనెల 26వ తేదీ వరకూ రెండు రోజులు ధ్రువపత్రాల పరిశీలనను పొడిగించినట్టు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

వైసీపీ మండల మహిళా అధ్యక్షురాలుగా చందక లక్ష్మి

ఆనందపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలుగా ఆనందపురం గ్రామంచె చెందని చందక లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు భీమిలి పార్టీ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ప్రకటించారు. ప్రస్తుతం చందక లక్ష్మి ఆనందపురం సర్పంచ్‌గా ఉన్నారు. ఆమె గతంలో కాంగ్రెస్ పార్టీ, వైసీపీ ప్రభుత్వాల హయాంలో మండల మహిళా అధ్యక్షురాలుగా పని చేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ మండలంలో గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి పని చేస్తానన్నారు. ముఖ్యంగా మహిళా సమస్యలపై పరిష్కారంపై పార్టీ తరఫున కృషి చేస్తానన్నారు. తనను ఈ పదవికి ఎంపిక చేసినందుకు మండల నాయకత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గాయత్రి మెడికల్ కళాశాలలో అడ్మిషన్లపై నిషేధం

... 5వ పేజీ తరువాయి

వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఎన్ఎంసీ అనుమతుల కోసం అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడి ఈ పరిస్థితి తెచ్చుకున్నట్టు చెబుతున్నారు. దేశంలోని మెడికల్ కాలేజీల్లో మౌలిక వసతులు, ఫ్యాకల్టీ, తదితరాలను పరిశీలించి నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతులు జారీ చేస్తుంది. ఇందుకోసం కాలేజీలకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు చెందిన వైద్యులు వెళుతుంటారు. అలా తనిఖీలకు వెళ్లిన వైద్యులతోపాటు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు చెందిన అధికారులను మభ్యపెట్టి గాయత్రీ మెడికల్ కాలేజీ అనుమతులు తెచ్చుకున్నట్టు సీబీఐ గుర్తించింది. గాయత్రీ మెడికల్ కాలేజీ నుంచి విశాఖకు చెందిన డాక్టర్ కృష్ణకిశోర్ సుమారు రూ.50 లక్షల వరకు తీసుకున్నట్టు సీబీఐ అధికారులు గుర్తించి చార్జిషీట్ ఫైల్ చేశారు. గాయత్రి డైరెక్టర్ వెంకట్‌పై కూడా కేసు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో తాజాగా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) గాయత్రీ మెడికల్ కాలేజీ ప్రవేశాలపై నిషేధాన్ని విధించింది.

ప్రభుత్వ కార్యక్రమాలపై ఇంటింటి ప్రచారం

» తంగుడుబిల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు


సంక్షేమ పథకాలపై కరపత్రాను అందిస్తున్న ఎమ్మెల్యే గంటా, టీడీపీ నేతలు

ఆనందపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ముచ్చర్ల గ్రామ పంచాయితీ తంగుడుబిల్లిలో ఇంటింటికి వెళ్లి ప్రజలను ఎమ్మెల్యే కలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గురించి వివరించారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చే దిశగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఘట్టమనేని సుభాష్‌చంద్రబోస్, మండల పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, గంట్రెడ్డి స్వామినాయుడు, బీఆర్బీ నాయుడు, యర్ర రాజు, బలిరెడ్డి మల్లికార్జునరావు, శ్రీకాంత్‌రాజు, అగరపు దేముడు, మీసాల సత్యనారాయణ, షిణగం శివ, షిణగం అప్పలనారాయణ, గొలగాని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలెంలో పైడితల్లమ్మ సారె ఊరేగింపు

భీమునిపట్నం (రూరల్) జూలై 22 (ఆంధ్రజ్యోతి) : భీమిలి రూరల్ మండలం తాటితూరు, గొల్లలపాలెం, నగరపాలెం గ్రామాల దేవత పైడితల్లమ్మకు పసుపు కుంకుమలు సమర్పించే మహోత్సవ కార్యక్రమం మంగళవారం నగరపాలెంలో వైభవంగా నిర్వహించారు. ఈ ఊరేగింపులో కోలాటం, తీన్మార్ నృత్యాలు, చిడతలు, సాముగరిడీ వంటి జానపద కళా ప్రదర్శనలతో భక్తులు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారి దేవాలయంలో పలువురు మహిళలు పైడితల్లి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు.

అచ్యుతానందన్‌కు సీపీఎం నేతల నివాళి


అచ్యుతానందన్‌కు నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు

తగరపువలస, జూలై 22 (ఆంధ్రజ్యోతి) కేరళ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతికి సంతాప సూచకంగా చిట్టివలస సీపీఎం కార్యాలయం వద్ద మంగళవారం సంతాపసభ నిర్వహించారు. తొలుత పలువురు నేతలు అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేరళలో ఆరు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన ఈయన ప్రజా జీవితంలో మూడుసార్లు ప్రతిపక్ష నాయకుడిగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా సేవలు అందించి ప్రజాసంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని, అచ్యుతానందన్ వంటి నాయకులు అరుదుగా ఉంటారని సీపీఎం కార్యదర్శి మూర్తి పేర్కొన్నారు. కేరళలో ప్రజా ఉద్యమాలు, ప్రజా పోరాటాలు నిర్మించడంలో ఎంతో కీలకంగా వ్యవహరించారని కొనియాడారు. సీపీఎం జోన్ కమిటీ నాయకులు ఎస్.అప్పలనాయుడు, పల్లా పెంటరాజు, పల్లా రమణ, నమ్మినాయుడు ఎల్లాజీ, చిరంజీవి తదితరులు మాట్లాడారు.

'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

ఆనందపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని బాకురుపాలెంలో వైసీపీ మండల నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో అమలు కాని హామీలు ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశాయన్నారు. సంవత్సర కాలంలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, ఈ తరుణంలో ప్రతి ఒక్క వైసీపీ నాయకుడు, కార్యకర్త గ్రామాల్లో పర్యటించి టీడీపీ ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయిన తీరును ప్రజలకు వివరించాలన్నారు. వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమం ద్వారా ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, ఎంపీపీ మజ్జి శారాదా ప్రియాంక, నాయకులు మజ్జి వెంకటరావు, గంట్రెడ్డి శ్రీనివాసరావు, పాండ్రంకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి రామకృష్ణ, చందక సూరిబాబు, చందక లక్ష్మి, కోరాడ ముసలినాయుడు, పిన్నింటి వెంకటరమణ, బోని అప్పలనాయడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సీఐటీయూ ప్రచారం

తగరపువలస, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి ఏర్పాటు చేయాలని తలంచిన స్మార్టు మీటర్లను రద్దు చేయాలని, అదనపు విద్యుత్ చార్జీలను వసూలు చేయరాదని కోరుతూ సీఐటీయూ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. జీవీఎంసీ 1, 2 వార్డుల పరిధిలో ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేస్తూ గోడలకు స్టిక్కర్లను అంటించారు. కూడలి ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కూటమిలో పోటీ

... 5వ పేజీ తరువాయి

ఇంతవరకూ ఎలాంటి పదవులను చేపట్టనందున ఏడు నెలలు అయినా స్టాండింగ్ కమిటీ సభ్యునిగా పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలంటూ తమ నియోజకవర్గాల శాసనసభ్యులపై ఒత్తిడి తెస్తున్నారు. అలాగే జనసేన, బీజేపీ కార్పొరేటర్లు సైతం స్టాండింగ్ కమిటీలో సభ్యత్వం కోసం పోటీపడుతున్నారు. పది స్థానాల్లో తమకు కనీసం నాలుగైనా కేటాయించాలని జనసేన నేతలు కోరుతుండగా, బీజేపీ రెండు స్థానాలు కోరుతున్నట్టు తెలిసింది. దీంతో ఏం చేయాలనే దానిపై మేయర్ పీలాశ్రీనివాసరావుతోపాటు ఎమ్మెల్యేలు తర్జనభర్జన పడుతున్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలపై వైసీపీ నేతలు ఇంతవరకూ నోరువిప్పడం లేదు. కూటమి పార్టీల్లో పరిస్థితిని బట్టి తాము అడుగులు వేయాలని భావిస్తున్నట్టు తెలిసింది.జీవీఎంసీలో 97 మంది కార్పొరేటర్లు ఉండగా కూటమికి 63 మంది బలం ఉండగా, వైసీపీకి 34 మంది బలం ఉంది. స్టాండింగ్ కమిటీ సభ్యునిగా ఎన్నికవ్వాలంటే కనీసం 44 ఓట్లు అవసరం. కూటమి పార్టీల కార్పొరేటర్లలో అసంతృప్తులు ఉన్నా, రెబల్స్‌గా ఎవరైనా పోటీకి దిగినాసరే వైసీపీ పోటీలో నిలబడే అవకాశం ఉంది. నామినేషన్ల దాఖలుకు 29 వరకూ అవకాశం ఉండడంతో అప్పటివరకూవేచి చూడాలని కార్పొరేటర్లు అభిప్రాయపడు తున్నారు.

ప్రైవేటు ఆస్పత్రులకు కళ్లెం

... 5వ పేజీ తరువాయి

254 ఉన్నాయి. క్లినిక్స్ 311, అల్ట్రా సౌండ్ పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లు 340, ఫిజియో థెరపీ యూనిట్లు 18, క్లినికల్ లేబొరేటరీలు 188, డెంటల్ ఆస్పత్రులు 40 వరకూ ఉన్నాయి. వీటిలో వైద్య సేవలకు సంబంధించిన ధరల జాబితాను వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరించారు.

పారదర్శక సేవలు అందించే ఉద్దేశంతోనే...

- డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు, క్లినిక్స్, ల్యాబ్‌లలో పారదర్శకమైన వైద్య సేవలు అందించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. రోగికి ముందే తాను పొందాలనుకునే వైద్యసేవ ధర తెలిస్తే నచ్చితే చేయించుకుంటాడు, లేదంటే మరోచోటకు వెళతాడు. ధరల పట్టిక ఏర్పాటు చేయకపోయినా, అందులో పేర్కొన్న దానికి అదనంగా వసూలు చేసినా చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రులు, క్లినిక్స్ ల్యాబ్‌ల నిర్వాహకులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. అమలు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు.

నకిలీ డాక్టర్ అరెస్టు

... 5వ పేజీ తరువాయి

హోటల్‌లో ఉండి డాక్టర్ ఆనంద్‌కు ఫోన్ చేస్తే లిఫ్టు చేయలేదు. అయితే వీరు కిడ్నీ అమ్మకం గురించి మాట్లాడుతుండడంతో హోటల్ మేనేజర్ అబ్బాస్ నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ సత్యనారాయణ వారిని పిలిపించి విచారించి పంపేశారు. అయితే తమకు అద్దె చెల్లించలేదని హోటల్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ చిన్నంనాయుడు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు డాక్టర్ ఆనంద్ పేరుతో పరిచయం చేసుకుంటున్న నకిలీ డాక్టర్ సయ్యద్ హనీఫ్ షాను అదుపులోకి తీసుకున్నారు. కిడ్నీ ఇప్పిస్తానంటూ కొంతమందిని, కిడ్నీ ఇచ్చేందుకు ముందుకువచ్చిన మరికొంతమందిని (మొత్తం ఏడుగురు) సయ్యద్ హనీఫ్ నమ్మించి డబ్బులు వసూలు చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. సయ్యద్ హనీఫ్ షాను మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు సీఐ సత్యనారాయణ తెలిపారు.

గీత దాటితే... పట్టేస్తుంది

... 5వ పేజీ తరువాయి

కంట్రోల్‌రూమ్ ద్వారా నగరంలో ప్రయాణించే వారికి తెలియజేయడంతోపాటు ప్రత్యామ్నాయ రోడ్ల వివరాలను సూచించడం వంటి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. నాలుగు సంస్థలకు ఐదు కూడళ్లలో పైలట్ ప్రాజెక్టుగా ఏఐ ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అమలు బాధ్యతలు అప్పగించారు. తొలిదశలో అక్కయ్యపాలెం, ఊర్వశి జంక్షన్, ఆర్‌అండ్‌బీ జంక్షన్, గోపాలపట్నం పెట్రోల్ బంక్, ఎండాడ జంక్షన్‌లను ఎంపిక చేశారు. ఆయా జంక్షన్లన్నీ 'వై' జంక్షన్లు కావడంతో వాటిని తొలిదశ కింద ఎంపిక చేసినట్టు పోలీసులు చెబుతున్నారు.

ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టు కింద ఐదు కూడళ్లలో అమలు చేసి, తరువాత ఫలితాలు, ఆయా కంపెనీలు ఇచ్చే డీపీఆర్ ఆధారంగా నగరంలోని అన్ని జంక్షన్లకు దీనిని అందుబాటులోకి తీసుకురావాలని సీపీ శంఖబ్రతబాగ్చి భావిస్తున్నట్టు ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మంచం పట్టిన భద్రయ్యపేట

... 5వ పేజీ తరువాయి

చేతులు దులిపేసుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పట్టించుకోని నేతలు, అధికారులు

గ్రామాన్ని కిడ్నీ వ్యాధి కబళిస్తోందని, ఒక్కొక్కరుగా బలైపోతున్నారని గగ్గోలు పెడుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పంచాయతీ నుంచి ఇద్దరు నేతలు జడ్పీటీసీ సభ్యులుగా ఎన్నికైనప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదంటున్నారు.

క్వారీలే కారణమా?

భద్రయ్యపేట చుట్టూ దశాబ్దాలుగా మూడు క్వారీలు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా భారీగా తవ్వేస్తున్నారు. ఇందుకోసం విషపూరిత రసాయనాలతో కూడిన పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలోనే భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఆ నీటిని తాగుతుండడంతో కిడ్నీ వ్యాధి సోకిందని చెబుతున్నారు. నిబంధనలను అతిక్రమించి క్వారీలు నిర్వహిస్తున్నారని గనులు, భూగర్భ వనరుల శాఖకు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించలేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిడ్నీవ్యాధినుంచి గ్రామస్థులనుకాపాడాలని కోరుతున్నారు.

పేదల కాలనీల్లో ప్లానింగ్ నిల్!

... 5వ పేజీ తరువాయి

ఎక్కడెక్కడ ఏమి రానున్నాయో?...స్పష్టంగా పేర్కొనలేదు.

ఏ బాధ్యత ఎవరిదనేది దానిపై కనీస చర్చ శూన్యం

ఇళ్ల నిర్మాణం పూర్తిచేసిన తరువాత ఆ కాలనీలకు రహదారులు, తాగునీరు, మురుగునీటి కాలువలు, విద్యుత్ సదుపాయం వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఒక్కో కాలనీలో పెద్ద పంచాయతీ, ఒక మోస్తరు మునిసిపాలిటీ ఉన్నంత జనాభా ఉంటారు. ఎటువంటి మౌలిక వసతులు లేకుండా లబ్ధిదారులకు అక్కడకు వెళ్లి ఉండాలంటే చాలా కష్టం. తాగునీటికి ఏ శాఖ నుంచి నిధులు వెచ్చించాలి?, ఎవరు బాధ్యత తీసుకోవాలనే దానిపై జగన్ సీఎంగా ఒక్క రోజు కూడా చర్చించలేదు. అధికారులు కూడా ఆ విషయం చెప్పలేదు. అలాగే మురుగునీరు పారుదల వ్యవస్థ ఎలా నిర్వహిస్తారో స్పష్టత లేదు. ఇళ్లు మాత్రం కట్టి ఇస్తామని గృహ నిర్మాణ శాఖ చెబుతోంది. మిగిలినవి కలెక్టర్‌తో మాట్లాడి లైన్ డిపార్టుమెంట్లతో చేయించాల్సి ఉంటుందని అంటున్నారు. జ్వరం వస్తే మందు వేసే దిక్కులేని చోట ఎలా ఉండగలమని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. మౌలిక వసతుల కోసం కూటమి ప్రభుత్వం పెద్ద కసరత్తు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అవన్నీ సమకూరిస్తే తప్ప లబ్ధిదారులు అక్కడకు వెళ్లే అవకాశం లేదు. ఈ పనులు ఎంత వేగంగా చేపడతారనే దానిపైనే ఎన్‌టీఆర్ కాలనీల గృహ ప్రవేశాలు ఆధారపడి ఉన్నాయి.


తులసీ దళార్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలేశునికి సహస్రనామ తులసీ దళార్చన

సింహాచలం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామికి మంగళవారం సంప్రదాయబద్ధంగా సహస్రనామ తులసీ దళార్చన చేశారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా పూర్తి చేసి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనరారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళాలతో పూజలు జరిపారు. అనంతరం ఇదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

వైభవంగా గ్రామ దేవతల పండుగ



అమ్మవారి సన్నిధిలో దేవస్థానం అధికారులు

సింహాచలం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సింహగిరి గ్రామస్థుల ఆరాధ్య దేవతలు ఉమామహేశ్వర పాదాలమ్మ, పుట్టబంగారమ్మల పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి అభిషేకాలు, పసుపుకుంకుమలతో పూజలు చేశారు. అప్పన్న ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు, డీఈఈ రామరాజు (హరి) తదితరులు అమ్మవార్లను దర్శించుకుని దేవస్థానం తరపున వస్త్రాలు, పండ్లు, పువ్వులను సమర్పించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. పులివేషాలు, నేల వేషాలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా దుర్గాలమ్మ ఉత్సవం

పద్మనాభం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పాండ్రంగి పంచాయతీ పరిధి కుర్రపల్లిలో మంగళవారం దుర్గాలమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఏటా ఆషాడంలో అమ్మవారి ఉత్సవం ఆచారం. గ్రామస్థుల సారెను తెచ్చి అమ్మవారికి సమర్పించారు. దుర్గాలమ్మను దర్శించచుకుని మొక్కులు చెల్లించారు.

సచివాలయాల్లో పనిచేయని కంప్యూటర్లు, ప్రింటర్లు



» వాటి పార్టులు మాయమయ్యాయని వెల్లువెత్తుతున్న ఆరోపణలు

» మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయని వాపోతున్న సిబ్బంది

సాగర్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 8వ వార్డు పరిధి సాగర్‌నగర్‌లో ఉన్న రెండు సచివాలయాల్లోని కంప్యూటర్లు, ప్రింటర్లు మూలకు చేరడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సాగర్‌నగర్‌లో ఒకే భవనంలో 86, 87 నంబర్లతో కూడిన రెండు సచివాలయాలు ఉన్నాయి. వీటిలోని కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయకపోవడంతో కుల, ఆదాయ, తదితర ధ్రువీకరణ పత్రాలను పొందే అవకాశం లేకుండా పోయింది. దీంతో బయట ఇంటర్నెట్ సెంటర్లకు వెళ్లి ప్రింట్లు తీసుకోవాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. కాగా గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లినవారు సొంత ల్యాప్‌టాప్‌లను తెచ్చుకుని విధులు నిర్వహించినట్టు తెలిసింది. కొత్తగా ఇక్కడకు బదిలీపై వచ్చినవారు తమ వద్ద ల్యాప్‌టాప్‌లు లేక ఇబ్బంది పడుతున్నారు.

గత వైసీపీ ప్రభుత్వం నాణ్యత లేని కంప్యూటర్లు, ప్రింటర్లను సరఫరా చేయడం వల్లే అవి మూలకు చేరాయని పలువురు విమర్శిస్తున్నారు. ఇదిలావుండగా ప్రస్తుతం సచివాలయాల్లో ఉన్న కంప్యూటర్లలోని కొన్ని పార్టులు మాయమయ్యాయన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. కాగా ఇక్కడి మరుగుదొడ్లు కూడా అధ్వానంగా తయారై తీవ్ర దుర్వాసన వస్తోందని పలువురు సచివాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

కేజీబీవీ విద్యార్థులకు ఉద్బోధ చేసిన భీమిలి ఆర్డీవో సంగీత్‌మాధుర్


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న భీమిలి ఆర్డీవో సంగీత్‌మాధుర్

పద్మనాభం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులందరూ ఉపాధ్యాయులు బోధించే పాఠాలను ఆకళింపు చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని భీమిలి ఆర్డీవో కె.సంగీత్‌మాధుర్ హితబోధ చేశారు. ఇక్కడి కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. విద్యాలయంలో ఉపాధ్యాయుల బోధన, వసతులు, వంటి వాటి గురంచి ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ అందరి జీవితంలో ఎంతో ఉన్నతమైనదని, దానిని సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆనందరావు, ఆర్ఐ శ్యామల, ప్రిన్సిపాల్ గ్రేస్‌లిల్లీ, తదితరులు పాల్గొన్నారు.

అనంతుడిని దర్శించుకున్న ఆర్డీవో

ఇక్కడి అనంత పద్మనాభుడిని భీమిలి ఆర్డీవో కె.సంగీత్‌మాధుర్ దర్శించుకున్నారు. ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టి వేదాశీర్వచనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఆలయ విశిష్టత గురించి అర్చకులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహశీల్దార్ కె.ఆనందరావు, తదితరులు ఉన్నారు.

సింహాచలంలో భిన్న వాతావరణం


వర్షం కురుస్తున్న దృశ్యం

సింహాచలం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సింహాచలం, పరిసర ప్రాంతాల్లో మంగళవారం భిన్న వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. అయితే మధ్యాహ్నం ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలకు కాస్త ఉపశమనం లభించానా.. మళ్లీ కాసేపటికే సూరీడు తన ప్రతాపం చూపడంతో ప్రజలకు ఉక్కపోత తప్పలేదు.

రామునాయుడు మృతికి సంతాపం

పద్మనాభం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడు కె.లక్ష్మణరావు సోదరుడు రామునాయుడు మృతదేహాన్ని పలువురు నాయకులు మంగళవారం సందర్శించి సంతాపం తెలిపారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఈ నెల 21న రామునాయుడి మృతి చెందగా, కోరాడలోని ఆయన స్వగృహం వద్ద మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. అంతిమ వీడ్కోలు పలికిన వారిలో టీడీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు, వైసీపీ భీమిలి ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

శాకంబరిగా వాసవీ కన్యకాపరమేశ్వరి

పద్మనాభం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారిని శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఏషియన్ స్కేటింగ్ పోటీలకు ఎండాడ యువతి


సాయి సంహిత

ఎండాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కొరియాలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న 20వ ఆసియా చాంపియన్‌షిప్ స్కేటింగ్ పోటీల్లో ఫ్రీస్టైల్, పెయిర్ విభాగంలో ఎండాడకు చెందిన ఆకుల సాయి సంహిత భారత్ తరపున పాల్గొంటుంది. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న సాయి సంహిత 2018లో జరిగిన ఏషియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించడంతో పాటు 2019లో చైనాలో జరిగిన పోటీల్లో రెండు సిల్వర్, ఒక కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. జాతీయ స్థాయిలో అనేక పతకాలను కైవసం చేసుకున్న సాయి సంహిత ప్రధాని మోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిండ్‌ల చేతులమీదుగా పురస్కారాలను అందుకుంది.

తైక్వాండోలో రాణించిన విద్యార్థికి అభినందనలు



కొమ్మాది, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో తమ విద్యార్థి కాంస్య పతకం సాధించడం ఎంతో ఆనందంగా ఉందని కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సురేశ్ అన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో గుంటూరు జిల్లా రేపల్లెలో జరిగిన ఏపీ 5వ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఈసీఈ మూడోఏ సంవత్సరం చదువుతున్న షేక్ ఉమర్ ఫరూక్ 58 కిలోలలోపు విభాగంలో కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం ఫరూక్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు ఫైనాన్స్ డైరెక్టర్ మాధవి, పీడీ వేణుగోపాల్, తదితరులు అభినందించారు.

పార్కు నిర్మాణం చేపట్టాలంటూ భానునగర్‌వాసుల వినతి

- 1990లో రోడ్డు విస్తరణకు భూసేకరణ సమయంలో స్థలాల కేటాయింపు
- పార్కు కోసం 450 గజాల స్థలం కేటాయించగా ఆక్రమించిన కబ్జాదారులు
- తాజాగా ఎమ్మెల్యే వెలగపూడిని కలిసిన కాలనీవాసులు
- జీవీఎంసీ కమిషనర్‌కు లేఖ రాసిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణను కలిసేందుకు వెళ్లిన భానునగర్ వాసులు

వెంకోజీపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌బీ కాలనీ నుంచి వెంకోజీపాలెం జాతీయ రహదారి వరకు 1990లో రోడ్డు విస్తరణ నిమిత్తం ఇళ్ల స్థలాలను ప్రభుత్వం సేకరించి, ప్రస్తు 16వ వార్డు భానునగర్‌లో స్థలాలను బాధితులకు ఇచ్చారు. ఈ క్రమంలో అప్పట్లో మున్సిపల్ కార్పొరేషన్ లే అవుట్‌ను కూడా వేసి నివాస స్థలాలతో పాటు కాలనీ ఒక పార్కు నిర్మాణానికి కూడా 450 గజాల స్థలం కేటాయించారు. అయితే ఆ తర్వాత ఈ పార్కు స్థలం కబ్జాకు గురైందని, తమ పార్కు స్థలాన్ని కాలనీకి అప్పగించాలని 2002లో కాలనీ వాసులు కోర్టును ఆశ్రయించగా 2022లో స్థలం కాలనీకి చెందినదేనని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే జీవీఎంసీ వారి నిర్లక్ష్యంతో కబ్జా అయిన స్థలాన్ని సేకరించకపోవడంతో కాలనీ వాసులు ఇటీవల ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, నగర మేయర్‌ను ఆశ్రయించగా.. ఈ ఏడాది ఏప్రిల్‌లో స్థలంలో సుమారు 320 గజాల స్థలాన్ని కబ్జాను తొలగించి, ఇంకా 130 గజాల్లో ఆక్రమణ బిల్డింగ్‌ను మాత్రం వదిలేశారు.

ఈ విషయమై మంగళవారం కాలనీవాసులు మళ్లీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును ఆశ్రయించారు. కబ్జాను పూర్తిగా తొలగించి, పార్కు నిర్మాణాన్ని ఇప్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ పార్కుకు స్థలానికి చుట్టూ ప్రహరీ గోడను నిర్మించాలని సూచిస్తూ జీవీఎంసీ అధికారులకు లేఖ రాశారు. దీంతోపాటు అప్పట్లో రోడ్డు విస్తరణ కోసం స్థలాలను పోగొట్టుకున్న తమకు భానునగర్‌లో స్థలాలను కేటాయించారన్నారు. కానీ వాటిని రెడ్ మార్కులో (22ఏ) ఉంచారని, నిజానికి ఇవి ప్రభుత్వ స్థలాలు కావని, తమకు నష్ట పరిహారంగా ఇచ్చిన స్థలాలని ఎమ్మెల్యేకు కాలనీ వాసులు వివరించారు. ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో తమ స్థలాలను 22ఏ నుంచి తొలగించాలని వినతి పత్రం కూడా ఇవ్వడం జరిగిందని, ఈ విషయంపై అధికారులు తమకు పట్టాలు మంజూరు చేస్తామంటున్నారని, నిజానికి ఇవి ప్రభుత్వ స్థలాలు కావని, తాము రోడ్డు విస్తరణలో పోగొట్టుకున్న స్థలాలకు నష్టపరిహారంగా ఇచ్చినవని, తమ సొంత స్థలాలన్నారు.

కాబట్టి కావున తమ ప్రాంతాన్ని 22ఏ నుంచి తొలగించాలని, తద్వారా రిజిస్ట్రేషన్‌లు అయ్యే విధంగా, రుణాలు వచ్చే విధంగా సహకరించాలని ఎమ్మెల్యేను కాలనీవాసులు కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీడీపీ 16వ వార్డు అధ్యక్షుడు నారు గోపి, కాలనీ వాసులు వంకా శివ శంకర్, జి.వామనమూర్తి, పడాల రమణ, పడాల గోవింద్, ఒమ్మి నాయుడు, కాంతం, మణి, దేవి, దేవుడమ్మ, లక్ష్మి, హైమా ఇతర కాలనీ వాసులు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణాల పరిశీలనకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం

- స్థానికులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనుల తీరుపై ఆరా తీసిన అధికారుల బృందం


పది రోజుల్లో నిర్మాణం పూర్తయిన నేతాజీ నగర్‌లోని డ్రైనేజీ


నలభై రోజులైనా నిర్మాణం పూర్తి చేయకుండా గోతులతో వదిలేసిన రజకవీధి రహదారి

మద్దిలపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో కాలువల నిర్మాణంలో కాంట్రాక్టర్, సచివాలయ ఉద్యోగులు చూపుతున్న వివక్షతపై ఈ నెల 21న స్థానికులు పీజీఆర్ఎస్‌లో జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

బాధితుల ఫిర్యాదును పరిశీలించిన కమిషనర్ విచారణ చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో.. మంగళవారం కొందరు అధికారులు పిఠాపురం కాలనీ చేరుకుని కాలువల నిర్మాణ పనులు పరిశీలించారు. మంగాపురం కాలనీ నుంచి రైతు బజార్ వరకు డ్రైనేజీ నిర్మాణం చేసి రజక వీధి వద్ద ఎందుకు ఆపేశారని కాంట్రాక్టర్‌ను నిలదీశారు. స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తి రజక వీధి డ్రైనేజీ నిర్మాణం చేయవద్దని చెప్పడంతో పనులు ఆపినట్టు కాంట్రాక్టర్ బదులిచ్చారు. దీంతో అధికారులు కూడా మౌనం వహించి కార్పొరేటర్ వద్దంటే మేమేం చేయలేమని చెప్పి వెనుదిరిగారు.

కాగా, ఈ ప్రాంతానికి సమీపంలోని నేతాజీ నగర్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇటీవల పది రోజుల్లో డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేశారని, ఇక్కడ రజక వీధిలో మాత్రం 40 రోజులుగా డ్రైనేజీ నిర్మాణం పేరుతో ఇబ్బందులకు గురి చేయడం దారుణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరును చూసిన బాధితులు జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన ఫలితం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏయూను సందర్శించిన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్


వీసీ రాజశేఖర్ తో మాట్లాడుతున్న వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్

వెంకోజీపాలెం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : ఏయూను వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ ఎస్ఎస్ రాజా సుబ్రమణి మంగళవారం సందర్శించారు. ఆయనకు ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు స్వాగతం పలికారు. అనంతరం ఏయూ వీసీ జీపీ రాజశేఖర్‌తో కార్యాలయంలో రాజా సుబ్రమణి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వీరు పలు అంశాలపై చర్చించారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధిని ఉపకులపతి రాజశేఖర్ తెలియజేశారు. త్రివిద దళాల ఉద్యోగులకు ఏయూ నిరంతరం సేవలు అందించడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని ఈ సందర్భంగా ఉపకులపతి తెలియజేశారు. విశ్వవిద్యాలయంలోని మానవ వనరులను సైనిక ఉద్యోగుల అభివృద్ధికి, వారిలో విభిన్న నైపుణ్యాలను పెంపొందించడానికి వినియోగిస్తామన్నారు. సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్‌తో త్రివిధ దళాలకు ఉన్న అనుభవాన్ని మరింత బలోపేతం చేస్తామని త్రివిధ దళాలలో పని చేస్తున్న సైనిక ఉద్యోగులకు అవసరమైన విభిన్న కోర్సులను ఏయూ పూరి స్థాయిలో అందిస్తుందని వీసీ వివరించారు.

'హరిహరమల్లు' ఘన విజయం కోరుతూ వినాయగర్ ఆలయం వద్ద పూజలు

సిరిపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ తాజాగా నటించిన హరిహరమల్లు చిత్రం ఘన విజయం సాధించాలని కోరుతూ మంగళవారం జనసేన నాయకులు సంపత్ వినాయగర్ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 24న విడుదల కానున్న చిత్రం విజయవంతం కావాలంటూ నినాదాలు చేస్తూ కొబ్బరికాయలు కొట్టారు.

కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విమ్స్‌లో 30 మందికి సదరం ధ్రువపత్రాలు జారీ

ఆరిలోవ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్)లో ఇటీవల సదరం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మంగళవారం సుమారు 30 మందికి ఈ కేంద్రం నుంచి వికలాంగ సర్టిఫికెట్లను జారీ చేశారు. సంబంధిత వైద్యులు దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఎంత శాతం వైకల్యం కలిగి ఉన్నారో నిర్ధారించి సర్టిఫికెట్లను జారీ చేయనున్నట్టు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు.

సినిమా గైడ్

- **జూనియర్** : మెలోడి, శరత్, జగదాంబ, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ)
- **తమ్ముడు** : శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : రమాదేవి
- **కొత్తపల్లిలో** : శారద
- **ఓ భామ అయ్యో రామ** : శారద
- **కన్నప్ప** : కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నటరాజ్ (పెందుర్తి).
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 39, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 20, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 32, బీరకాయలు 24, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 44,దొండకాయలు 22, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 48, బరబాటి 24, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 45,బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 68, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 46, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 42, కూరపెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు


.తిమ్మాపురం కొండదిగువన వెలసిన పాకలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

సాగర్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపురం రామానాయుడు స్టూడియో కొండ దిగువన ఆక్రమణల పరంపరకు ఆర్డీఓ సంగీత్‌మాథూర్ ఆదేశాలతో చినగదిలి రూరల్ తహసీల్దార్ పాల్‌కిరణ్ చెక్ పెట్టారు. సిబ్బందితో కలిసి మంగళవారం తొలగింపు కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ ప్రాంతం అత్యంత ఖరీదైనది కావడంతో రామానాయుడు స్టూడియో కొండదిగువన సర్వే నంబరు 379లో ఉన్న ప్రభుత్వస్థలం పై కబ్జాదారుల కన్నుపడింది. కొంతకాలంగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు.

సుమారు 1500 గజాల స్థలంలో పూరిపాకలు వెలిశాయి. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో రెండురోజుల కిందట పై ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను తొలగించగా, ఇద్దరు వ్యక్తులు రెవెన్యూ సిబ్బందిపై తిరగబడ్డారు. దీంతో వారిపై పోలీసు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో మంగళవారం పోలీసు బందోబస్తుతో ఆక్రమణలను తొలగించారు.

సమాజాభివృద్ధికి విద్య కీలకం

జేఎన్టీయూ (కె) వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్


సమావేశంలో పాల్గొన్న జేఎన్‌టీయూ కాకినాడ వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, ఏయూ వీసీ రాజశేఖర్, వివిధ విభాగాల ప్రిన్సిపాల్స్, డీన్లు

వెంకోజీపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సమాజాభివృద్ధికి విద్య కీలకమని జేఎన్టీయూ కాకినాడ వీసీ ఆచార్య సీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. మంగళవారం ఏయూను సందర్శించిన ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు ఓ క్లస్టర్‌గా పని చేయాలని సూచించారు. ప్రతి విశ్వవిద్యాలయంలో అనుసరించే అత్యుత్తమ విధానాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు. వర్సిటీల ప్రతిష్ఠను పెంచే విధంగా, బోధన విధానాన్ని బలోపేతం చేసే దిశగా పనిచేయాలని కోరారు. విశ్వవిద్యాలయాలు కలిసి ముందుకు సాగుతూ ప్రగతిని సాధించాలని చెప్పారు. బోధన, అభ్యసనం, పరిశోధన రంగాల్లో అవగాహన ఒప్పందాలు చేసుకుందామని సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించే దిశగా కలిసి పని చేయాలని ఈ సందర్భంగా ఏయూను కోరారు.

ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ సంయుక్త భాగస్వామ్య కోసం తమ సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఈఎన్. ధనుంజయ రావు, ప్రిన్సిపాల్స్, డీన్‌లు తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌కు పెరుగుతున్న రోగుల తాకిడి


ఓపీ కౌంటర్ల వద్ద బారులు

ఆరిలోవ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్)కు ఇటీవల రోగుల తాకిడి పెరుగుతోంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆస్పత్రికి భారీగా రోగులు వచ్చారు. మంగళవారం ఉదయం నుంచీ ఓపీ వద్ద రోగులు బారులు తీరారు. సుమారు 1078 మంది రోగులు వచ్చి వైద్య సేవలు పొందినట్టు విమ్స్ డైరెక్టర్ డాక్టర కె.రాంబాబు తెలిపారు, ప్రస్తుతానికి 240 మంది ఇన్ పేషెంట్లు ఉన్నారని తెలిపారు. సుమారు 250 బెడ్స్ ఉన్నాయన్నారు. వివిధ విభాగాల్లో 62 మంది వైద్యులు సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. రోగుల సంఖ్య ఇటీవల గణనీయంగా పెరుగుతోందని తెలిపారు. విశాఖపట్నం నుంచే కాకుండా శ్రీకాకుళం, విజయనగరం, ఒడిశా, చత్తీస్‌ఘడ్ తదితర ప్రాంతాల నుంచి రోగులు వస్తున్నారని తెలిపారు.

మధ్యాహ్న భోజనంతో నిల్వ కోడిగుడ్లు పెట్టే యత్నం..

టీచర్లు గుర్తించడంతో ఎండీఎం వర్కర్ బాగోతం బట్టబయలు

భీమునిపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటి వద్ద నిల్వ ఉంచగా పాడైన కోడిగుడ్లను పాఠశాల వద్దకు తెచ్చి మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు పెట్టే యత్నంలో ఓ ఎండీఎం వర్కర్ ఉపాధ్యాయుల కంటపడింది. దీంతో ఆమెను ఉపాధ్యాయులు ఇలాంటి పనులు చేయడం తప్పు అని హితవు చెప్పి ఇకపై విధులకు హాజరు కావద్దంటూ స్పష్టం చేశారు. కాస్త ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనంతో ఉడకబెట్టిన నిల్వ కోడిగుడ్లు వడ్డించడానికి ఎండీఎం వర్కర్ ఒక ఆమె ప్రయత్నించారు. అయితే, ఆ విషయాన్ని కనిపెట్టిన ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఈ గుడ్లు ఎక్కడివని ప్రశ్నించారు. సుమారు 35 ఉడక బెట్టిన గుడ్లను ఆమె ఇంటి దగ్గర నుంచి తీసుకొనిచ్చారు. రెండు రోజుల కితం గుడ్లులా ఉన్నాయని, వాటికి దుర్వాసన కూడా వస్తున్నాయని ఉపాధ్యాయులు తెలిపారు. కాగా, ఆ పాఠశాలకు సమీపంలోనే నివసిస్తున్న ఆమె ఏదో ఫంక్షన్‌లో మిగిలిన ఉడక బెట్టిన గుడ్లను ఫ్రిజ్‌లో ఉంచి సోమవారం పాఠశాలకు తీసుకొచ్చి ఆ గుడ్లను విద్యార్థులకు వడ్డించి, పాఠశాలలో గుడ్లు తీసుకుపోదామనుకున్న ప్లాన్ వేసి ఉండవచ్చని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. అయితే, ప్రభుత్వం సరఫరా చేసే తాజా గుడ్లను, భోజనాన్నే విద్యార్థులకు వడ్డించాలని, ఈ విధంగా ఇంటి వద్ద నుంచి తీసుకొచ్చినవి పెట్టకూడదని ఉపాధ్యాయులు ఆమెను మందలించారు. దీంతో ఆమె ఆ గుడ్లను పిల్లలకు పెట్టడానికి తీసుకురాలేదని, పారేద్దామని తెచ్చానంటూ బుకాయించిందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రమణ తెలిపారు. నిల్వ గ్రుడ్లు కావడంతో వాసనకూడా వస్తున్నాయని అన్నారు. దీంతో ఆమెను సోమవారం నుంచి విధులకు రావద్దని చెప్పిట్టు హెచ్ఎం తెలిపారు. దీంతో ఆమె విధుల్లోకి తీసుకోకపోతే తాను అఘాయిత్యానికి పాల్పడతానంటూ బెదిరింపులకు దిగుతోందని ఉపాధ్యాయులు తెలిపారు. ఇటువంటి పనులు చేయకూడదని తెలియడానికే ఆమెను మందలించామన్నారు.

అన్ని ప్రాంతాలు అభివృద్ధి.. అందరికీ సంక్షేమం

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు
- 15వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు


సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ శ్రీవిద్య, టీడీపీ నాయకులు

వెంకోజీపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సూచించారు. జీవీఎంసీ 15వ వార్డులోనిఉమానగర్, పాత వెంకోజీపాలెంలో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, ఇతర నాయకులు, కార్యకర్తలు పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం పూర్తయిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నామన్నారు. ఎన్నికల ముందు తాము ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో ఇప్పటికే చాలా వరకు సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, మిగిలినవి కూడా అతి త్వరలో పూర్తిగా అమలు చేస్తామన్నారు. సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం సమర్థవంతంగా అందించడమే అతని లక్ష్యమన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీహెచ్ గోవింద్, ఆర్.నారాయణ, సోమేశ్వరి, వరలక్ష్మి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇండియన్ సిల్క్‌గ్యాలరీ ఎక్స్ పో ప్రారంభం


ఎక్స్ పోలో వస్త్రాలను పరిశీలిస్తున్న నగర వాసులు

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన అద్భుతమైన వస్త్ర సంపదను విశాఖ వాసులకు అందించేందుకు వీలుగా రామ్‌నగర్‌లోని గ్రీన్‌పార్కు హోటల్‌లో మంగళవారం ఇండియన్ సిల్క్‌గ్యాలరీ ఎక్స్‌పోను ప్రారంభించారు. సంప్రదాయ వస్త్రవైభవం, నగర వాసులకు చక్కని షాపింగ్ అనుభూతి కలిగిస్తుందన్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఎక్స్‌పోలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి హస్తకళాకారులు రూపుదిద్దిన అద్భుత డిజైన్ల వస్త్రాలు ఉన్నాయన్నారు. వీటి తయారీ వెనుక శ్రమ, శైలి, సంస్కృతి సంప్రదాయాలకు సాక్ష్యంగా నిలుస్తాయన్నారు. రాష్ట్రంలోని ఉప్పాడ, ధర్మవరం పట్టు చీరలు, పల్లూ, బంగారు జరీ వర్క్‌తో ప్రత్యేకత పొందాయన్నారు. తమిళనాడు కంచి పట్టు చీరలు హుందాగా ఉంచుతాయన్నారు. మైసూరు సిల్క్, గద్వాల్, పోచంపల్లి వస్త్రాలు ఆకట్టుకుంటాయన్నారు. ఐదు రోజుల పాటు వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు నిర్వహిస్తామని ఎక్స్‌పో ప్రతినిధి శ్రీనివాసరావు తెలిపారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పెంపు హర్షణీయం

- జీవీఎంసీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు

వెంకోజీపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మున్సిపల్ శాఖలో నాన్ పబ్లిక్ హెల్త్ ఆప్కోస్ విధానంలో పని చేస్తున్న కేటగిరి 1, 2, 3 ఉద్యోగుల జీతాలు పెంచుతూ జీవో నెంబరు 124ను ప్రభుత్వం జారీ చేయడం హర్షణీయమని జీవీఎంసీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల జీతాల పెంపు అంశం రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో జరిగిన అంశమని, కానీ ఇటీవల కొంతమంది జీవీఎంసీలోని ఉద్యోగ సంఘాల నాయకులు తామే పెంచేందుకు కృషి చేస్తున్నట్టు ప్రగల్బాలు పలుకుతూ సంబంధిత ఉద్యోగుల నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారన్నారు. వాస్తవానికి ఈ జీతాలు పెంపును డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని అన్ని యూనియన్లతో పాటు అమరావతి రాష్ట్ర జేఏసీ అనుబంధ అవుట్ సోర్స్ ఉద్యోగుల సంఘం తరపున, అలాగే జీవీఎంసీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తరపున ప్రభుత్వానికి లేఖలు పంపామన్నారు. ఇదిలావుండగా రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచితే జీవీఎంసీలోని కొన్ని యూనియన్లు వారి ఘనకార్యంగా డబ్బులు వసూళ్ల పర్వానికి తెరలేపారని, దీన్ని ఏ ఒక్క ఉద్యోగి నమ్మవద్దని, డబ్బులు ఇచ్చి మోసపోవద్దని, ఇటువంటి వ్యక్తులపై సంబంధిత పోలీసు కేసులు నమోదు చేయాలని లేదా తమ యూనియన్‌కు సమాచారం అందించవచ్చని వామనరావు ప్రకటన ద్వారా సూచించారు.

'యూనివర్సిటీ పేపర్ లీక్' చిత్రాన్ని ఆదరించండి

- సినీనటుడు ఆర్.నారాయణమూర్తి పిలుపు


విద్యార్థులతో కలిసి ప్రచార చిత్రాన్ని చూపుతున్న ఆర్.నారాయణమూర్తి

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): 'యూనివర్సిటీ పేపర్ లీక్' సినిమాను వీక్షించాలని సినీ నిర్మాత, నటుడు, దర్శకుడు, పీపుల్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి కోరారు. ఆంధ్రా యూనివర్సిటీలో మంగళవారం ఎస్ఎఫ్ఐ, ఇతర విద్యార్థి సంఘాలు నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యావ్యవస్థలో రూ.లక్షలు ఖర్చు చేసి, కష్టపడి పోటీ పరీక్షలు రాస్తుంటే, కొంత మంది కార్పొరేట్ సంస్థల్లో ఉన్నవారికే ర్యాంకులు రావాలని, వారి వద్ద ఉంటూ సన్నద్ధమవుతున్నవారికేఉద్యోగాలు రావాలన్న ఆశతో పేపర్ లీక్‌లకు పాల్పడుతున్నారన్నారు. దీని మూలంగా పేద విద్యార్థులు కష్టపడి చదువుకున్నప్పటికీ మేలు జరగటం లేదన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో పోటీ పరీక్షల పేపర్‌లు లీకవటంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ఇలాంటి వాటిని కళ్లకు కట్టినట్టు చూపించటానికి ఈ చిత్రాన్ని నిర్మించారన్నారు. ఈ సినిమాను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఎల్.జె.నాయుడు, అజయ్, వెంకటరమణ, నరేష్, మౌనిక, భరత్, సోమేష్ పాల్గొన్నారు.

కొండవాలులో 'వెలుగు' చూడని రహదారులు

- వీధి దీపాలు లేక నిత్యం చీకటే
- వాహనాల వెలుగుల్లోనే ప్రయాణం


కొండవాలు ప్రాంతాల్లో చీకటి దారిలో వాహనాల కాంతిలోనే రాకపోకలు..

మురళీనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని కొండ సమీప ప్రాంతాలుగా ఉండే కైలాసపురం, మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీ, మాధవధార ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు చీకట్లలోనే మగ్గుతున్నాయి. 48ఎ ఆర్టీసీ బస్సులు తిరిగే మెయిన్ రోడ్డులోనే చిమ్మచీకటిగా ఉంటోంది. సింహాచలం గిరి ప్రదక్షిణ వంటి ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే తాత్కాలిక కాంట్రాక్టులిచ్చి స్తంభాలు వేసి 'అడుగడుగునా వీధి దీపాలు వెలిగించి ఈ రూట్‌లో వెలుగులు జిగేల్ మనిపిస్తున్నారు. తిరిగి సాధారణ రోజుల్లో ఎప్పుడూ మాదిరిగానే వాహనాల కాంతుల్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. పాదచారులకు మరీ ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతోంది. ఎన్‌జీజీఓస్ కాలనీ మురళీనగర్ సీఐఎస్ఎఫ్ క్వార్టర్సు దారిలో నిత్యం అంధకారమే రాజ్యమేలుతోంది. మాధవధార ఉడాకాలనీ కొండవాలు ప్రాంతాలు, నియోజకవర్గ సరిహద్దు ప్రాంతంగా ఉన్న ఆర్అండ్‌బీ జంక్షన్ వరకు ఉన్న 48ఎ బస్ రూట్‌లోని అంబేడ్కర్ కాలనీ నివాసిత ప్రాంతంలో అయితే తరుచూ చీకటి దారుల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరో వైపు చిల్లర దొంగతనాలు జోరందుకున్నాయి. మహిళలు ఈ దారుల్లో అడుగేయాలంటే సందేహిస్తున్నారు. అధికారులు ఈ పరిస్థితిని చక్కదిద్ది, వెలుగులు ప్రత్యేక రోజుల్లోనే కాకుండా ప్రతినిత్యం ఉండేలా చూడాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఏయూను సందర్శించిన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్


వీసీ రాజశేఖర్‌తో చర్చిస్తున్న సుబ్రమణి

వెంకోజీపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి మంగళవారం సందర్శించారు. ఆయనకు ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు స్వాగతం పలికారు. అనంతరం వైస్‌చాన్సలర్ జీపీ రాజశేఖర్‌తో రాజా సుబ్రమణి ప్రత్యేకంగా సమావేశంకాగా ఏయూ అభివృద్ధిని తెలియజేశారు. త్రివిధ దళాల ఉద్యోగులకు సేవలందించడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని వైస్‌చాన్సలర్ తెలియజేశారు. ఏయూలోని మానవ వనరులను సైనిక ఉద్యోగుల అభివృద్ధికి, వారిలో విభిన్న నైపుణ్యాల పెంపునకు వినియోగిస్తామన్నారు. సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్‌తో త్రివిధ దళాల అనుభవాన్ని మరింత బలోపేతం చేస్తామని, సైనిక ఉద్యోగులకు అవసరమైన విభిన్న కోర్సులను ఏయూ పూర్తి స్థాయిలో అందిస్తుందని వీసీ హామీ ఇచ్చారు.

డీడీఈవో ఆకస్మిక సందర్శన


బాలికలతో కలిసి భోజనం చేస్తున్న అధికారి

అక్కయ్యపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి (డీడీఈవో) సోమేశ్వరరావు ఆకస్మికంగా సందర్శించారు. అన్ని తరగతి గదులను పరిశీలించి ఉపాధ్యాయుల బోధన తీరు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

నకిలీ డాక్టర్ అరెస్టు

... 5వ పేజీ తరువాయి

హోటల్‌లో ఉండి డాక్టర్ ఆనంద్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. అయితే వీరు కిడ్నీ అమ్మకం గురించి మాట్లాడుతుండడంతో హోటల్ మేనేజర్ అబ్బాస్ నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ సత్యనారాయణ వారిని పిలిపించి విచారించి పంపేశారు. అయితే తమకు అద్దె చెల్లించలేదని హోటల్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ చిన్నంనాయుడు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు డాక్టర్ ఆనంద్ పేరుతో పరిచయం చేసుకుంటున్న నకిలీ డాక్టర్ సయ్యద్ హనీఫ్ షాను అదుపులోకి తీసుకున్నారు. కిడ్నీ ఇప్పిస్తానంటూ కొంతమందిని, కిడ్నీ ఇచ్చేందుకు ముందుకువచ్చిన మరికొంతమందిని (మొత్తం ఏడుగురు) సయ్యద్ హనీఫ్ నమ్మించి డబ్బులు వసూలు చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. సయ్యద్ హనీఫ్ షాను మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు సీఐ సత్యనారాయణ తెలిపారు.

గీత దాటితే... పట్టేస్తుంది

... 5వ పేజీ తరువాయి

కంట్రోల్‌రూమ్ ద్వారా నగరంలో ప్రయాణించే వారికి తెలియజేయడంతోపాటు ప్రత్యామ్నాయ రోడ్ల వివరాలను సూచించడం వంటి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. నాలుగు సంస్థలకు ఐదు కూడళ్లలో పైలట్ ప్రాజెక్టుగా ఏఐ ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అమలు బాధ్యతలు అప్పగించారు. తొలిదశలో అక్కయ్యపాలెం, ఊర్వశి జంక్షన్, ఆర్అండ్‌బీ జంక్షన్, గోపాలపట్నం పెట్రోల్ బంక్, ఎండాడ జంక్షన్‌లను ఎంపిక చేశారు. ఆయా జంక్షన్లన్నీ 'వై' జంక్షన్లు కావడంతో వాటిని తొలిదశ కింద ఎంపిక చేసినట్టు పోలీసులు చెబుతున్నారు.

ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టు కింద ఐదు కూడళ్లలో అమలు చేసి, తరువాత ఫలితాలు, ఆయా కంపెనీలు ఇచ్చే డీపీఆర్ ఆధారంగా నగరంలోని అన్ని జంక్షన్లకు దీనిని అందుబాటులోకి తీసుకురావాలని సీపీ శంఖబ్రతబాగ్చి భావిస్తున్నట్టు ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నూకాంబిక ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాలు


నూకాంబిక అమ్మవారు

మురళీనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గంలోని బర్మాక్యాంప్‌లో ప్రసిద్ధ నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఈ నెల 25 నుంచి ఆగస్టు 25 వరకు శ్రావణ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు పి.బుచ్చిబాబు శర్మ తెలిపారు. ఇప్పటికే ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేసారు. ఉదయం 6 గంటల నుంచి నిత్యార్చన, శ్రావణమాసం నెల రోజులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలియజేశారు. శ్రావణ మంగళవారం, శుక్రవారం అమ్మవారికి ప్రత్యేకంగా భక్తుల స్వహస్తాలతోనే పంచామృతాభిషేకం చేపట్టే వెసులు బాటు కల్పిస్తున్నామని అన్నారు. నూతన వస్త్రధారణ, ప్రత్యేక అలంకరణలతో దీపారాధన, విశేష పుష్పార్చన జరుగుతుంది. భక్తులు అమ్మవారి సేవలో భాగస్వాములు కావాలని కోరారు. నెల రోజులు జరిగే వేడుకల్లో భక్తులకు అమ్మవారి అలంకరణలోని గాజులు, పూజా కుంకుమ అందించనున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ వాలీబాలర్‌కు అభినందన


చరణ్‌ను అభినందిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): థాయిలాండ్‌లో జరిగిన ఏషియన్ అండర్-16 వాలీబాల్ చాంపియన్‌షిప్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన నగరానికి చెందిన స్పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) సెంటర్ క్రీడాకారుడు అట్టాడ చరణ్‌ను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. శాయ్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతూ నేరుగా భారత జట్టులో స్థానం పొందడమే కాకుండా ప్రతిష్ఠాత్మక ఏషియన్ వాలీబాల్ టోర్నీలో కాంస్య పతకం సాధించి భారత జట్టులో కీలక ఆటగాడిగా రాణించిన చరణ్ అభినందనీయుడని కొనియాడారు. చరణ్ సాధించిన ఘనత కేవలం శాయ్ శిక్షణ కేంద్రానికే కాకుండా జిల్లా, రాష్ట్ర వాలీబాల్ క్రీడారంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. చరణ్‌ను అంతర్జాతీయ స్థాయి వాలీబాలర్‌గా తీర్చిదిద్దిన శాయ్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి, వాలీబాల్ కోచ్ సత్యనారాయణను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఒలింపియన్ ఎంవీ.మాణిక్యాలు, వాలీబాల్ సంఘం ప్రతినిధులు రక్షణ కుమార్, మోహన్‌బాబు పాల్గొన్నారు.

'నామినేటెడ్ పోస్టుల్లో వాడబలిజలకు ప్రాధాన్యత ఇవ్వాలి'

మహారాణిపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల భర్తీలో వాడబలిజలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీ ఫిషింగ్ బోట్ ఆపరేటర్సు అసోసియేషన్ అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మణరావు అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోస్తాలో వాడబలిజలు 31 శాతం మంది ఉన్నారని, తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉన్నప్పటికీ నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు చొరవ చూపి తమకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.

'యూనివర్సిటీ' చిత్రాన్ని ఆదరించండి

సినీనటుడు ఆర్.నారాయణమూర్తి పిలుపు


విద్యార్థులతో కలిసి ప్రచార చిత్రాన్ని చూపుతున్న ఆర్.నారాయణమూర్తి

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): 'యూనివర్సిటీ పేపర్ లీక్' సినిమాను వీక్షించాలని సినీ నిర్మాత, నటుడు, దర్శకుడు, పీపుల్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి కోరారు. ఆంధ్రా యూనివర్సిటీలో మంగళవారం ఎస్ఎఫ్ఐ, ఇతర విద్యార్థి సంఘాలు నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యావ్యవస్థలో రూ.లక్షలు ఖర్చు చేసి, కష్టపడి పోటీ పరీక్షలు రాస్తుంటే, కొంత మంది కార్పొరేట్ సంస్థల్లో ఉన్నవారికే ర్యాంకులు రావాలని, వారి వద్ద ఉంటూ సన్నద్ధమవుతున్నవారికేఉద్యోగాలు రావాలన్న ఆశతో పేపర్ లీక్‌లకు పాల్పడుతున్నారన్నారు. దీని మూలంగా పేద విద్యార్థులు కష్టపడి చదువుకున్నప్పటికీ మేలు జరగటం లేదన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో పోటీ పరీక్షల పేపర్‌లు లీకవటంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ఇలాంటి వాటిని కళ్లకు కట్టినట్టు చూపించటానికి ఈ చిత్రాన్ని నిర్మించారన్నారు. ఈ సినిమాను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఎల్.జె.నాయుడు, అజయ్, వెంకటరమణ, నరేష్, మౌనిక, భరత్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులకు కళ్లెం

... 5వ పేజీ తరువాయి

254 ఉన్నాయి. క్లినిక్స్ 311, అల్ట్రా సౌండ్ పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లు 340, ఫిజియో థెరపీ యూనిట్లు 18, క్లినికల్ లేబొరేటరీలు 188, డెంటల్ ఆస్పత్రులు 40 వరకూ ఉన్నాయి. వీటిలో వైద్య సేవలకు సంబంధించిన ధరల జాబితాను వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరించారు.

పారదర్శక సేవలు అందించే ఉద్దేశంతోనే...

ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు, క్లినిక్స్, ల్యాబ్‌లలో పారదర్శకమైన వైద్య సేవలు అందించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. రోగికి ముందే తాను పొందాలనుకునే వైద్యసేవ ధర తెలిస్తే నచ్చితే చేయించుకుంటాడు, లేదంటే మరోచోటకు వెళతాడు. ధరల పట్టిక ఏర్పాటు చేయకపోయినా, అందులో పేర్కొన్న దానికి అదనంగా వసూలు చేసినా చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రులు, క్లినిక్స్, ల్యాబ్‌ల నిర్వాహకులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. అమలు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు.

- డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

అశోక్ గజపతిరాజుకు ఎమ్మెల్సీ వేపాడ అభినందన


అశోక్ గజపతిరాజును అభినందిస్తున్న ఎమ్మెల్సీ

డాబాగార్డెన్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన సందర్భంగా పూసపాటి అశోక్ గజపతిరాజును విజయనగరంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగుదేశం పార్టీకి ఆయన నిజాయతీగా అందించిన సేవలు అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. అశోక్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

ఈత పోటీల్లో పతకాల సాధకులకు అభినందన


విజేత బాలలను అభినందిస్తున్న వైశాఖి కమిటీ సభ్యులు


బుల్లయ్య కళాశాలలో ప్రీతికి అందజేస్తున్న ప్రశంసాపత్రం

సీతంపేట/మురళీనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించిన ఈత పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య జూనియర్ కళాశాల బైపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని బి.పి.కె.ఎల్. ప్రీతి 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 200 మీటర్ల బటర్‌ఫ్లై, ఫ్రీ స్టైల్ విభాగాల్లో మూడు స్వర్ణ పతకాలు, రెండు రజత పతకాలు సాధించింది. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్, యాజమాన్యం ప్రతినిధులు ప్రీతిని మంగళవారం ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

వైశాఖి స్పోర్ట్సు పార్కు లో..: మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కు ఈతకొలనులో సాధన చేసిన బాలలు బీచ్‌రోడ్డులో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించిన ఈత పోటీల్లో ప్రతిభ చాటారు. గ్రూప్ 2లో ప్రియేష్ నాయుడు 50 మీటర్లు, 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ పోటీలో బంగారు పతకం సాధించారు. 200 మీటర్లలో బ్రెస్ట్ స్ట్రోక్‌లో వెండిపతకం అందుకున్నారు. గ్రూప్ 3లో మరో బాలుడు బండి సౌరవ్ 100 మీటర్ల ఫ్రీ స్టయిల్, బ్రెస్ట్ స్ట్రోక్‌లోనూ వెండిపతకం సాధించారు. 200 మీటర్ల ఫ్రీ స్టయిల్‌లో మరో రజత పతకం పట్టేశాడు. గ్రూప్ 2 కేటగిరీలో సనపల ప్రేమ్‌కుమార్ 100 మీటర్ల ఫ్రీ స్టయిల్ పోటీల్లో రజత పతకం దక్కింది. ఈ సందర్భంగా మంగళవారం వైశాఖీ స్పోర్ట్సు పార్కు కమిటీ ఆధ్వర్యంలో పతక సాధకులను అభినందించి సత్కరించారు. కమిటీ ప్రతినిధులు ఎస్.వరప్రసాద్, ఎస్.సత్యనారాయణ, కనకరాజు, ఎల్.వి.సుధాకర్‌లు బాలల ప్రతిభను కొనియాడారు.

పేదల కాలనీల్లో ప్లానింగ్ నిల్!

... 5వ పేజీ తరువాయి

ఎక్కడెక్కడ ఏమి రానున్నాయో?...స్పష్టంగా పేర్కొనలేదు.

ఏ బాధ్యత ఎవరిదనేది దానిపై కనీస చర్చ శూన్యం

ఇళ్ల నిర్మాణం పూర్తిచేసిన తరువాత ఆ కాలనీలకు రహదారులు, తాగునీరు, మురుగునీటి కాలువలు, విద్యుత్ సదుపాయం వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఒక్కో కాలనీలో పెద్ద పంచాయతీ, ఒక మోస్తరు మునిసిపాలిటీ ఉన్నంత జనాభా ఉంటారు. ఎటువంటి మౌలిక వసతులు లేకుండా లబ్ధిదారులకు అక్కడకు వెళ్లి ఉండాలంటే చాలా కష్టం. తాగునీటికి ఏ శాఖ నుంచి నిధులు వెచ్చించాలి?, ఎవరు బాధ్యత తీసుకోవాలనే దానిపై జగన్ సీఎంగా ఒక్క రోజు కూడా చర్చించలేదు. అధికారులు కూడా ఆ విషయం చెప్పలేదు. అలాగే మురుగునీరు పారుదల వ్యవస్థ ఎలా నిర్వహిస్తారో స్పష్టత లేదు. ఇళ్లు మాత్రం కట్టి ఇస్తామని గృహ నిర్మాణ శాఖ చెబుతోంది. మిగిలినవి కలెక్టర్‌తో మాట్లాడి లైన్ డిపార్టుమెంట్లతో చేయించాల్సి ఉంటుందని అంటున్నారు. జ్వరం వస్తే మందు వేసే దిక్కులేని చోట ఎలా ఉండగలమని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. మౌలిక వసతుల కోసం కూటమి ప్రభుత్వం పెద్ద కసరత్తు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అవన్నీ సమకూరిస్తే తప్ప లబ్ధిదారులు అక్కడకు వెళ్లే అవకాశం లేదు. ఈ పనులు ఎంత వేగంగా చేపడతారనే దానిపైనే ఎన్టీఆర్ కాలనీల గృహ ప్రవేశాలు ఆధారపడి ఉన్నాయి.

43వ వార్డులో 'తొలి అడుగు'


కరపత్రాలు అందిస్తున్న దువ్వారపు రామారావు

అక్కయ్యపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డులోని పలు ప్రాంతాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని టీడీపీ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలతో రూపొందించిన కరపత్రాలు పంపిణీ చేశారు. శ్రీదేవి, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కవి దాశరథి శాంతి విప్లవ యోధుడు

- శత జయంత్యుత్సవ సభలో డాక్టర్ డి.వి.సూర్యారావు అభివర్ణన



సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ డి.వి.సూర్యారావు, వేదికపై ఇతర ప్రముఖులు

సీతంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ నినదించిన తెలంగాణ ఉద్యమ కవి దాశరథి కృష్ణమాచార్య శాంతి విప్లవ యోధుడని ప్రముఖ సాహితీ విశ్లేషకుడు డాక్టర్ డి.వి. సూర్యారావు అన్నారు. దాశరథి ఉద్యమ సాహిత్యంపై ఆయన ప్రసంగిస్తూ కవికి ప్రాంతీయ భేదం లేదని, ఆయన సమసమాజవాది, పోరాట యోధుడు అని కొనియాడారు. తిమిరంతో సమరం చేసిన మహాకవిగా దాశరథిని అభివర్ణించారు. దాశరథి కృష్ణమాచార్య శత జయంత్యుత్సవ సభను ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం మంగళవారం నిర్వహించింది. ఈ సభకు అరసం జిల్లా శాఖ అధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహిస్తూ గత సంవత్సరం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిపిన దాశరథి ఉత్సవాలను గుర్తు చేశారు. తెలంగాణ కవి అయినా తెలుగు తల్లి అని దాశరథి ప్రస్తావించారని పేర్కొన్నారు. అరసం కవి బసు పోతన స్వాగతోపన్యాసం చేశారు. దాశరథి చలనచిత్ర గీతాలను, గీత రచనను వ్యాఖ్యాత రాంభట్ల నృసింహశర్మ పరిచయం చేశారు. అరసం ఉపాధ్యక్షుడు ఎస్.హనుమంతరావు, సాహితి అభిమానులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

డాబాగార్డెన్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖకు చెందిన రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ విభాగంలోని కమ్యూనిటీ మేనేజ్ నేచరల్ ఫార్మింగ్ జిల్లా పర్యవేక్షకుడు అల్లంశెట్టి మోహనరావు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. రైతు సాధికార సంస్థలో ఈ చట్టం పరిమితులు, విధానాలు, విధులపై అవగాహన కలిగించారు. జిల్లా స్థాయిలో రైతు సాధికార సంస్థలో పనిచేస్తున్న అన్ని స్థాయుల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సమాచారం పొందే హక్కును ప్రజలు ఎలా వినియోగించుకోవచ్చో, ప్రభుత్వ సంస్థలు ఎటువంటి బాధ్యతలు నిర్వహించవలసి వస్తుందో తెలియజేశారు.

గ్రహణం మొర్రి చికిత్సతో ఆత్మవిశ్వాసం

మహారాణిపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో గ్రహణం మొర్రికి చికిత్స శారీరక ఆరోగ్యానికే కాకుండా ఆత్మవిశ్వాసానికి దోహదపడుతుందని స్మైల్ ట్రైన్ ఇండియా అంబాసిడర్ డాక్టర్ పావని అన్నారు. గ్రహణం మొర్రి దినాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా పరిషత్ జంక్షన్‌లోని ఒక సమావేశమందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విస్తృత ప్రచార కార్యక్రమాల ద్వారా గ్రహణం మొర్రికి నాణ్యమైన చికిత్స ఉచితంగా అందుతుందని, ఎన్నో కుటుంబాలకు మేలు చేకూరుతుందని డాక్టర్ పావని అన్నారు. చికిత్స పొందిన చిన్నారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కూటమిలో పోటీ

... 5వ పేజీ తరువాయి

ఇంతవరకూ ఎలాంటి పదవులను చేపట్టనందున ఏడు నెలలు అయినా స్టాండింగ్ కమిటీ సభ్యునిగా పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలంటూ తమ నియోజకవర్గాల శాసనసభ్యులపై ఒత్తిడి తెస్తున్నారు. అలాగే జనసేన, బీజేపీ కార్పొరేటర్లు సైతం స్టాండింగ్ కమిటీలో సభ్యత్వం కోసం పోటీపడుతున్నారు. పది స్థానాల్లో తమకు కనీసం నాలుగైనా కేటాయించాలని జనసేన నేతలు కోరుతుండగా, బీజేపీ రెండు స్థానాలు కోరుతున్నట్టు తెలిసింది. దీంతో ఏం చేయాలనే దానిపై మేయర్ పీలా శ్రీనివాసరావుతోపాటు ఎమ్మెల్యేలు తర్జనభర్జన పడుతున్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలపై వైసీపీ నేతలు ఇంతవరకూ నోరువిప్పడం లేదు. కూటమి పార్టీల్లో పరిస్థితిని బట్టి తాము అడుగులు వేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. జీవీఎంసీలో 97 మంది కార్పొరేటర్లు ఉండగా కూటమికి 63 మంది బలం ఉండగా, వైసీపీకి 34 మంది బలం ఉంది. స్టాండింగ్ కమిటీ సభ్యునిగా ఎన్నికవ్వాలంటే కనీసం 44 ఓట్లు అవసరం. కూటమి పార్టీల కార్పొరేటర్లలో అసంతృప్తులు ఉన్నా, రెబల్స్‌గా ఎవరైనా పోటీకి దిగినాసరే వైసీపీ పోటీలో నిలబడే అవకాశం ఉంది. నామినేషన్ల దాఖలుకు 29 వరకూ అవకాశం ఉండడంతో అప్పటివరకూ వేచిచూడాల్సిందేనని కార్పొరేటర్లు అభిప్రాయపడుతున్నారు.

గాయత్రి మెడికల్ కళాశాలలో అడ్మిషన్లపై నిషేధం

... 5వ పేజీ తరువాయి

వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఎన్ఎంసీ అనుమతుల కోసం అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడి ఈ పరిస్థితి తెచ్చుకున్నట్టు చెబుతున్నారు. దేశంలోని మెడికల్ కాలేజీల్లో మౌలిక వసతులు, ఫ్యాకల్టీ, తదితరాలను పరిశీలించి నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతులు జారీ చేస్తుంది. ఇందుకోసం కాలేజీలకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు చెందిన వైద్యులు వెళుతుంటారు. అలా తనిఖీలకు వెళ్లిన వైద్యులతోపాటు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు చెందిన అధికారులను మభ్యపెట్టి గాయత్రీ మెడికల్ కాలేజీ అనుమతులు తెచ్చుకున్నట్టు సీబీఐ గుర్తించింది. గాయత్రీ మెడికల్ కాలేజీ నుంచి విశాఖకు చెందిన డాక్టర్ కృష్ణకిశోర్ సుమారు రూ.50 లక్షల వరకు తీసుకున్నట్టు సీబీఐ అధికారులు గుర్తించి చార్జిషీట్ ఫైల్ చేశారు. గాయత్రి డైరెక్టర్ వెంకట్‌పై కూడా కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) గాయత్రీ మెడికల్ కాలేజీ ప్రవేశాలపై నిషేధాన్ని విధించింది.

హిందూదేశంగా మార్చేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలు

- డీహెచ్‌పీఎస్ ప్రతినిధుల ఆరోపణ
- విశాఖలో 26న దళిత హక్కుల మహాసభలు



నినదిస్తున్న దళిత హక్కుల పోరాట సమితి ప్రతినిధులు

సీతమ్మధార, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్, బీజేపీలు రాజ్యాంగ సవరణ ద్వారా సెక్యులర్, సోషలిస్టు అనే పదాలను తొలగించాలని ప్రయత్నిస్తున్నాయని, భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చాలని పన్నాగం పన్నుతున్నాయని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జె.వి. ప్రభాకర్ ఆరోపించారు. రామాటాకీస్ రోడ్డులో గల అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం గల దేశంలో సెక్యులర్ అనే పదాన్ని తొలగించడానికి బీజేపీ ప్రచారం చేస్తుందన్నారు. ఇది ఒక్క దళితుల సమస్య కాదని, దేశంలో ప్రజలందరిదిగా గుర్తించాలన్నారు. సుప్రీంకోర్టు కూడా ఆ పదాలను తొలగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసిందన్నారు. ఆర్ఎస్ఎస్ జాతీయ జెండాను గౌరవించదని పేర్కొన్నారు. ఈ నెల 26న అంబేడ్కర్ భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి విశాఖ జిల్లా ఐదో మహాసభను నిర్వహిస్తున్నామని, అన్ని సంఘాల ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత దళితులందరిపైనా ఉందన్నారు. అత్యాచారాలు, సాంఘిక బహిష్కరణ, దళితులపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ బాధితులకు అండగా నిలబడ్డామన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు రాంబాబు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మంచం పట్టిన భద్రయ్యపేట

... 5వ పేజీ తరువాయి

చేతులు దులిపేసుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పట్టించుకోని నేతలు, అధికారులు

గ్రామాన్ని కిడ్నీ వ్యాధి కబళిస్తోందని, ఒక్కొక్కరుగా బలైపోతున్నారని గగ్గోలు పెడుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పంచాయతీ నుంచి ఇద్దరు నేతలు జడ్పీటీసీ సభ్యులుగా ఎన్నికైనప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదంటున్నారు.

క్వారీలే కారణమా?

భద్రయ్యపేట చుట్టూ దశాబ్దాలుగా మూడు క్వారీలు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా భారీగా తవ్వేస్తున్నారు. ఇందుకోసం విషపూరిత రసాయనాలతో కూడిన పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలోనే భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఆ నీటిని తాగుతుండడంతో కిడ్నీ వ్యాధి సోకిందని చెబుతున్నారు. నిబంధనలను అతిక్రమించి క్వారీలు నిర్వహిస్తున్నారని గనులు, భూగర్భ వనరుల శాఖకు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించలేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిడ్నీ వ్యాధి నుంచి గ్రామస్థులను కాపాడాలని కోరుతున్నారు.


కార్మికుడికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

భద్రతపై కార్మికులకు పోటీలు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్మికుడు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఈడీ పి.రవికుమార్ సూచించారు. విభాగంలో సేఫ్టీ గైడన్స్ అనే అంశంపై కార్మికులకు మంగళవారం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ప్రగతిలో ప్రతి కార్మికుడిది కీలకపాత్ర అని, భద్రతతోనే ప్లాంట్ ప్రగతి ఆధారపడి ఉంటుందన్నారు. పని ప్రదేశంలో అందరూ భద్రతా పనిముట్లను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో సివిల్ స్ట్రక్చర్ ఇంజనీరింగ్ విభాగం ఇన్‌చార్జి ఎస్.కృష్ణబాలుడు, సేఫ్టీ అధికారి బయ్యే మల్లయ్య, అధికారులు సాయిప్రసాద్, నారాయణరావు, టిర్కి, సుకేశ్‌లాల్, శుభాకర్, రమణ, జోసెఫ్, పావని, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కిరెడ్డిపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ 11కేవీ కణితి ఫీడర్ పరిధిలో లైన్ల జీబ్రా కండక్టర్ల మార్పు పనులు చేపడుతున్న కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు జోన్-2 ఈఈ టీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పంతులుగారి మేడ, చిట్టినాయుడు కాలనీ, దశమికొండ, పద్మజ ఆస్పత్రి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేటి నుంచి ఐటీఐ కౌన్సెలింగ్

గాజువాక, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్టీల్ సిటీ ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కేఏస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని పేర్కొన్నారు. బుధవారం ఉదయం 7.5 జీపీఏ నుంచి 10 జీపీఏ వరకు, మధ్యాహ్నం 5. 7నుంచి 7.4 జీపీఏ, 24న 4.5 నుంచి 5.6 జీపీఏ వరకు, మధ్యాహ్నం అన్ని మార్కుల వారికి, 25న మిగిలిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

మల్కాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వృద్ధులే దేశ సంపదని, వారి అనుభవాలే మానవ వనరులని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో 'గ్రాండ్ పేరెంట్స్ డే' మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాతయ్యలు, బామ్మలు, తమ మనవళ్లకు, మనవరాళ్లకు సంస్కారాన్ని, మానవ విలువల గురించి వివరించాలని అన్నారు. భారతదేశ సంస్కృతికి బంధుత్వాలే మూలమన్నారు. ఈ సందర్భంగా గ్రాండ్ పేరెంట్స్ తమ అనుభవాలను పంచుకున్నారు. గ్రాండ్ పేరెంట్స్ పాత్ర గురించి కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, సీనియర్ హిందీ అధ్యాపకురాలు ఎ.ఆదిలక్ష్మి ప్రసంగించారు. అనంతరం 1971లో భారత్- పాకిస్థాన్ యుద్ధంలో పాల్గొన్న ప్రముఖ సైనికుడు లక్ష్మణరావును ఘనంగా సత్కరించారు. గ్రాండ్ పేరెంట్స్‌కు కళాశాల యాజమాన్యం బహుమతులు అందజేసింది.

సినిమా గైడ్

- **జూనియర్** : మెలోడి, శరత్, జగదాంబ, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ)
- **తమ్ముడు** : శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : రమాదేవి
- **కొత్తపల్లిలో** : శారద
- **ఓ భామ అయ్యో రామ** : శారద
- **కన్నప్ప** : కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నటరాజ్ (పెందుర్తి).
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 39, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 20, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 32, బీరకాయలు 24, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 22, క్యారెట్ 44, దొండకాయలు 22, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 48, బరబాటి 24, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 45, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 68, కీరదోస 30, క్యాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 46, దేముడు చిక్కుడు 66, గోరుచిక్కుడు 42, కూరపెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190


చీకటిమయంగా ఆటోనగర్-యాదవ జగ్గరాజుపేట రోడ్డు


అంధకారంతో నిండిన కణితిలోని ఓ వీధి

గాఢాంధకారంతో సతమతం

ఆటోనగర్ నుంచి యాదవ జగ్గరాజుపేట, వై.జంక్షన్ నుంచి కణితి ప్రాంతాల్లో రాజమేలుతున్న చీకటి

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

ఆటోనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ నుంచి యాదవ జగ్గరాజుపేట, వై.జంక్షన్ నుంచి కణితి కాలనీ పరిసరాలలో గాఢాంధకారం రాజ్యమేలుతోంది. ఆయా ప్రాంతల్లో విద్యుత్ దీపాల పనితీరు సక్రమంగా లేదని, దాదాపు మూడున్నరేళ్ల గా ఇదే పరిస్థితి నెలకొనడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం-ఆరిపోవడం తప్పా పూర్తి స్థాయిలో పనిచేసిన సందర్భాలు లేవని వాపోతున్నారు. దీంతో రాత్రయ్యేసరికి ఆయా మార్గాల్లో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

కాగా యాదవ జగ్గరాజుపేట, ఆటోనగర్ కాలనీల సమీపంలో ఉన్న మలుపు మార్గంలో చీకటిపడితే చాలు భయానక వాతావరణం నెలకొంటుందని, నిర్మానుష్యంగా ఉండే ఈ మార్గం ఆకతాయిలు, చిల్లర దొంగలకు అడ్డాగా మారడంతో రాకపోకలు సాగించడం ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు మహిళలు, చిన్నారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల ఉన్న విద్యుత్ దీపాలు కూడా తక్కువ కాంతిలో వెలుగుతున్నాయని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంతో పాటు మిగిలిన అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ కృషి

- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- వాలీబాల్ విజేతకు సత్కారం



క్రీడాకారుడు చరణ్‌ను సత్కరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పక్కన వెంకన్న సన్నిధిలో పూజల్లో పాల్గొన్న మంత్రి

కూర్మన్నపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. 88వ వార్డు గ్రీన్ సిటీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చొరవ చూపాలని పేర్కొన్నారు. పలువురి కార్యకర్తల నుంచి వినతులను స్వీకరించారు.

అనంతరం ఇటీవల థాయిలాండ్‌లో అండర్-16 జాతీయ ఏషియన్ బాలుర వాలీబాల్ పోటీల్లో కణితి కాళింగు వీధికి చెందిన అట్టాడ చరణ్ కాంస్య పతకం సాధించిన సందర్భంగా మంత్రితో పాటు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావులు దుశ్శాలువా కప్పి సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొండా జగన్, కాకి గోవింద రెడ్డి, పల్లా శ్రీనివాస్, గంధం శ్రీనువాస్, ముత్యాలనాయుడు, రౌతు శ్రీనివాస్, బొడ్డు నరసింహపాత్రుడు, ప్రసాదుల శ్రీనివాస్, వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావు, కేసరనేని శ్రీనివాస్, బండి మోహిత్, నల్లూరు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీబీఎల్ వెంకనన్న దర్శించుకున్న మంత్రి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రాన్ని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సందర్శించారు. మంత్రికి పాలక మండలి సభ్యులతో పాటు వేదపండితులు ఘనంగా స్వాగతం పలికారు. దివ్యక్షేత్రంలోని వేంకటేశ్వరస్వామిని మంత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దివ్యక్షేత్రంలో చేపడుతున్న అన్న సమారాధనతో పాటు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి లక్ష్యం

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు


నందమూరినగర్‌లోని జరిగిన 'సుపరిపాలన' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, జూలై 22(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో పరిపాలన సాగుతోందని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. మంగళవారం జీవీఎంసీ 92వ వార్డు నందమూరినగర్‌లోని జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడం చంద్రబాబు లక్ష్యమని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అనంతరం వార్డులోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'వారి జ్ఞాపకాలు మనతోనే ఉంటాయి'

ఎన్.ఎ.డి.జంక్షన్: విధుల్లో భాగంగా అండమాన్ వెళుతూ 'ఏఎన్ 32' విమాన ప్రమాదంలో మృతి చెందిన ఎన్ఏడీ ఉద్యోగుల జ్ఞాపకాలు, వారి సేవలు మరవలేనివని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. విమాన ప్రమాదంలో మృతి చెందిన ఉద్యోగులను స్మరించుకుంటూ ఏర్పాటు చేసిన స్మృతి దివస్‌లో ఆయన మాట్లాడారు. తోటి ఉద్యోగులు చనిపోయిన రోజును గుర్తుంచుకుని, పదిమంది ప్రాణాలు నిలిపేందుక చేపట్టిన రక్తదాన శిబిరం గొప్ప విషయమన్నారు. సీఈ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఏవీ థామస్ మాట్లాడుతూ రక్తదాన శిబిరం నిర్వహించనివ్వకుండా మేనేజ్‌మెంట్ ప్రయత్నించిందని ఆరోపించారు. ఈ శిబిరంలో 108 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ వెంకట్రావు, సీఈ యూనియన్ అధ్యక్షుడు పీఏ.రాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ కాంట్రాక్టు కార్మికుల నిరసన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

అక్కిరెడ్డిపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ యాజమాన్యం అకారణంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అక్కిరెడ్డిపాలెం నుంచి పాత గాజువాక వరకు సాగిన ఈ ర్యాలీలో విధుల నుంచి తొలగించిన కాంట్రాక్టు కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.మణి మాట్లాడుతు పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం సమావేశమైన 305 కాంట్రాక్టు కార్మికులను డెయిరీ యాజమాన్యం విధుల నుంచి తొలగించి నియంతలా వ్యవహరించడం దారుణమన్నారు. 45 రోజులుగా విధులకు హాజరు కాకపోవడం వల్ల కుటుంబాలతో వారు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే డెయిరీ యాజమాన్యం స్పందించి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.రాంబాబు, ఎల్.బంగారునాయుడు, ఎ.లోకేశ్, ఎన్.రాజేంద్రప్రసాద్, జి.లక్ష్మి, సంతోషం, శ్రీదేవి, సతీశ్‌కుమార్‌తో పాటు తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో పెరుగుతున్న అరాచకం

ఐద్వా మహిళల ఆవేదన


కార్యక్రమంలో పాల్గొన్న ఐద్వా నాయకులు, తదితరులు

మల్కాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను సక్రమంగా అమలు చేయకపోవడం వల్లే సమాజంలో అరాచకం పెరిగిపోతోందని, మహిళలకు రక్షణ లేకుండా పోతోందని ఐద్వా మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా మల్కాపురం జోన్ 10వ మహాసభలు మంగళవారం వెంకన్నపాలెం సీఐటీయూ కార్యాలయంలో జరిగాయి. ముందుగా సీపీఎం నాయకురాలు కారాడ పోలమ్మ పతాకావిష్కరణ చేయగా, ఐద్వా వ్యవస్థాపకురాలు వైదాడ ధర్మారం చిత్రపటానికి సంఘం కార్యదర్శులు బి.పద్మ, వైసత్యవతి దండలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద మహిళా సంఘం తమదేనన్నారు. మూడేళ్లగా చేస్తున్న ఉద్యమాలు, పోరాటాలకు సంబంధించి నివేదికను ప్రవేశపెట్టారు.

స్టీల్ ప్లాంట్ డైరెక్టర్‌ను కలిసిన నాయకులు


డైరెక్టర్‌తో మాట్లాడుతున్న నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో పనిచేస్తున్న కార్మికులను ఇబ్బందులకు గురిచేసే చర్యలు చేపట్టరాదని, కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డైరెక్టర్ (ఆపరేషన్స్) సలీమ్ పురోత్తమన్‌ను గుర్తింపు యూనియన్ నాయకులు కోరారు. ప్లాంటులో మంగళవారం వారు డైరెక్టర్‌ను కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఓ విభాగంలో అనుభవం ఉన్న ఉద్యోగులను మరో విభాగానికి మార్చడం వల్ల ఇబ్బందులు వస్తాయన్నారు. ఆ విభాగంలో నైపుణ్యం ఉండదని, తప్పనిసరి పరిస్థితుల్లో బదిలీ చేయాల్సి వస్తే శిక్షణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, అధ్యక్షుడు కేఎస్ఎన్ రావు, తదితరులు పాల్గొన్నారు.


జోరువాన కురుస్తున్న దృశ్యం

అగనంపూడిలో భారీ వర్షం

అగనంపూడి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై నుంచి వర్షపు నీరు పారింది. మధ్యాహ్నం వరకు తీవ్ర ఉక్కు పోత, ఎండతో అవస్థల పడిన ప్రజలు ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని వాతావరణం చల్లబడి భారీ వర్షం కురిసింది. కాగా నిర్వాసిత కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో వర్షానికి మురుగు నీరంతా రహదారులపై ప్రవహించడంతో నివాసితులు ఇబ్బందులకు గురయ్యారు.

రెండు వార్డుల్లో 'తొలి అడుగు'

పెదగంట్యాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ ఏడాది పాలన కొనసాగిందని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అన్నారు. వాంబే కాలనీలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రట్టి వాసు, పి.వెంకటేశ్వరరావు, ఎస్.దేముడు, డి.శ్రీనివాసరాజు, ఎన్.భాస్కరరావు, స్వరూపారాణి, తదితరులు పాల్గొన్నారు. అలాగే 75వ వార్డు పరిధి ఎస్సీ కాలనీలో టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. కూటమి ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. నాయకులు నమ్మి అప్పారావు, ఎం.పెంటయ్య, ఉరుకూటి అప్పలరాజు, మణికుమార్, బొంగు రాజు, వి.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.


రహదారిపై వంటా-వార్పు చేపట్టి భోజనాలు చేస్తున్న దృశ్యం

క్లాప్ డ్రైవర్ల వంటా-వార్పు

గాజువాక, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ క్లాప్ వాహనాల డ్రైవర్లు, ఇతరు సిబ్బంది మంగళవారం జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం వద్ద వంటా-వార్పు కార్యక్రమం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఇదిలావుండగా క్లాప్ వాహనాల డ్రైవర్లు విధులకు దూరంగా ఉండడంతో పలు ప్రాంతాల్లోని రోడ్లు చెత్తాచెదారంతో నిండిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుకు గురవుతున్నారు. కార్యక్రమంలో నాయకులు గొలగాని అప్పారావు, నాగరాజు, ధనరాజ్, చంటి, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ములగాడ రోడ్డును నిర్మించాలని నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

మల్కాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 58వ వార్డు ములగాడ గ్రామం నుంచి మారుతి సర్కిల్ వరకు రోడ్డును నిర్మించాలని కోరుతూ మంగళవారం సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి పోర్టు యాజమాన్యం రూ.75 లక్షలు కేటాయించిందని, ఆ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సరైన రోడ్డులేకపోవడంతో దుమ్ము, దూళి రేగుతోందని, ప్రయాణం చేయాలంటే నరకం చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయంలో ఎమ్మెల్యే గణబాబు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

'వీరమల్లు' విజయం కోసం పూజలు


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు

పెందుర్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' విడుదల కానున్న సందర్భంగా చిత్రం విజయం సాధించాలని కోరుకుంటూ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, పార్టీ కార్యకర్తలు మంగళవారం చినముషిడివాడ పంచముఖ వీరాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

వేపగుంట: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రం విజయవంతం కావాలని కోరుతూ స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రత్యేక పూజలు చేశారు. చారిత్రక నేపథ్యంలో తీసిన ఈ చిత్రం తప్పక విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

'రైతులకు పీఏసీల చైర్మన్లు సేవలందించాలి'


పీఏసీ చైర్మన్లను సత్కరించిన బండారు, కోన తాతారావు, తదితరులు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రుణాలు మంజూరు చేయడం ద్వారా రైతులకు సేవ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నూతనంగా ఎంపికైన పీఏసీల చైర్మన్లుకు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలియజేశారు. మర్రిపాలెం వుడా కాలనీలోని డీసీసీబీ కార్యాలయంలో మాడుగుల నియోజకవర్గానికి నూతనంగా ఎంపికైన 32 పీఏసీ చైర్మన్లు, అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలు బలోపేతం ద్వారానే రైతుల ఇబ్బందులు తొలుగుతాయని అన్నారు. డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు మాట్లాడుతూ పీఏసీల బలోపేతానికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని, రుణాలు మంజూరు చేయడంలో రైతులకు అధిక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో సీఈవో డీవీఎస్ వర్మ, జి.ఎమ్.అన్నపూర్ణ, డీసీసీబీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

అగనంపూడి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ప్రాంత ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో బుధవారం ఉద్యోగ విమరణ చేసిన ఉక్కు ఉద్యోగుల కుటుంబాలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ గుదే సుశీలగజేంద్రరరావు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ఉక్కు ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ దినోత్సవం

అగనంపూడి. జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి సత్రం జంక్షన్‌లో గల మహాత్మాగాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ జెండా ఆవిష్కరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జగన్నాథస్వామి ఆలయ ట్రస్టు చైర్మెన్ కరణం పైడిరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు, స్థానిక నాయకులు కోసూరి తాతారావు, రాజేశ్, అప్పారావు, కుమార్, మహేశ్, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలంటూ నేడు ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ధర్నా చేపట్టనున్నట్టు సీఐటీయూ ప్లాంట్ నాయకులు తెలిపారు. కార్మికుల హక్కులను కాలరాయడంతో పాటు కార్మికులను విభాగాలకు మార్చడం, టౌన్‌షిప్ వాసులకు విద్యుత్ బిల్లుల పెంపు, హెచ్ఆర్ఏ చెల్లింపు చేపట్టకపోవడం, తదితర సమస్యలను పరిష్కరించాలని ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఉక్కు అడ్మిన్ భవనం ముందు ధర్నా చేస్తున్నామని పేర్కొన్నారు.

నిరుపేద కుటుంబానికి సాయం

అగనంపూడి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అగనంపూడికి చెందిన శేఖరమంత్రి రమణమ్మ కుటుంబం పేదరికంతో ఇబ్బందులకు గురవుతుండడంతో సద్భావన సేవా సమితి అండగా నిలిచింది. మంగళవారం ఆమెను కలిసి సమితి కార్యదర్శి జి.పూర్ణానందశర్మ నిత్యావసర సరుకులను అందజేశారు. ప్రజా సంఘాల నాయకులు గుదే సుశీల గజేంద్రరరావు, చిత్తా రామారావు, చినఅప్పారావు, హనుమంతరావు, దేముడు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో సేవలందించాలి

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నిబద్ధతతో సేవలందించడం న్యాయవాదుల బాధ్యతని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. న్యాయసేవాసదన్‌లో మంగళవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. సకాలంలో నాణ్యమైన న్యాయసేవలు అందించడం వల్ల న్యాయవ్యవస్థపై ప్రజలకున్న నమ్మకం పెరుగుతుందన్నారు. ప్యానెల్ న్యాయవాదులు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కేసుల విచారణకు అత్యవసర పరిస్థితి, పెండింగ్ వ్యవధి వంటి అంశాలను ప్యానెల్ న్యాయవాదులు కోర్టుకు నివేదించాలన్నారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

'రేషన్ బియ్యం పంపిణీలో ఫిర్యాదులొస్తే చర్యలు'

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించి ఫిర్యాదులు వస్తే వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మీర్ భాస్కర్ పేర్కొన్నారు. రేషన్ డీలర్ల నుంచి వసూళ్ల శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై స్పందించారు. జిల్లాలోని అన్ని డిపోలు తనిఖీలు చేసి అవకతవకలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు తనిఖీలు చేస్తున్నారన్నారు. డీలర్లు నిబంధనలను ఉల్లంఘించినా, కార్డుదారులతో అమర్యాదగా వ్యవహరించినా, థంబ్ తీసుకుని బియ్యం ఇవ్వకుండా ఇబ్బంది కలిగించినా, కార్డుదారులు నుంచి కొనుగోలు చేసినా, అదనంగా డబ్బులు వసూలు చేసినా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శుభ ముహూర్తాలకు వేళాయె

సింహాచలం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): త్వరలో తెలుగు వారిండ్లలో పెళ్లిబాజాలు మోగనున్నాయి. ఈనెల 25న శ్రావణమాసం ప్రారంభం కానుంది. ఈ నెలలో 26, 30,31 తేదీలతోపాటు, ఆగస్టు 1, 3, 5, 7 నుంచి 14వరకు, 17వ తేదీ, సెప్టెంబరు 24, 26, 27, 28, అక్టోబరు 1 నుంచి 4, 8, 10, 11, 12, 22, 24, 29, 30, 31, నవంబరు 1, 2, 7, 8, 12, 13, 15, 22, 23, 26, 27, 29, 30 తేదీల్లో శుభ ముహూర్తాలున్నాయని పంచాగకర్తలు చెబుతున్నారు. మధ్యలో ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 21వరకు భాద్రపద మాసం కావడంతో ఎలాంటి ముహూర్తాలు లేవు.

కూటమి పాలనలోనే ప్రశాంత జీవనం

» ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» రవాణా శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఆటోనగర్/ గాజువాక, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలంతా సీఎం చంద్రబాబు పాలనలో ప్రశాంత జీవనాన్ని సాగిస్తున్నారని, సంక్షేమం, మహిళల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం సాగుతోందని రవాణాశాఖా మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. వచ్చే నెల 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభిస్తామన్నారు. 70వ వార్డు టీవీఎస్ కాలనీలో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం డ్రైవర్స్ కాలనీలోని ద్రోణంరాజు కల్యాణ మండపంలో టీడీపీ వార్డు అధ్యక్ష కార్యదర్శులు చట్టి గోపి, కేవీఎస్ శంకరరావుల ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోం దన్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో కుంటుపడిన పాలనను గాడిన పెట్టేందుకు కృషి చేస్తున్నారన్నారు. అవినీతి, అక్రమాలు, దోపిడీలు, కుట్రలకు వైసీపీ అధినేత జగన్ బ్రాండ్ అంబాసిడర్ అని విమర్శించారు. రాష్ట్ర ప్రగతిని చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ హయాంలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తూ, ప్రజలకు సుపరిపాలన అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం సాగుతోందన్నారు. స్టీల్ ప్లాంటుకు నిధులను తీసుకువచ్చి కాపాడామన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించడంతో పాటు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే.. కూటమి సర్కారు ఏడాదిలోనే ఎన్నో పథకాలను అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, బొడ్డు నరసింహపాత్రుడు, మొల్లి ముత్యాలనాయుడు, రౌతు శ్రీనివాసరావు, నాయకులు పుచ్చా విజయ్‌కుమార్, బొడ్డేటి రమణ, దేనంకొండ కృష్ణంరాజు, లంకల మురళీ దేవి, ఆడారి రామకృష్ణ, రోమాల శ్రీనివాస్, చట్టి గోపి, పీఎంఎల్ నాయుడు, మూర్తి, రమేశ్, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా

వ్యవస్థలను స్వేచ్ఛగా పనిచేయనిస్తే అద్భుత విజయాలు

» ఆనందగజపతి రాజు జీవిత విశేషాలతో కూడిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు

మహారాణిపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాజకీయ వ్యవస్థలో శాస్త్రవేత్తలు, త్రివి ధ దళాలను స్వేచ్ఛగా పనిచేయనిస్తే 'ఆపరేషన్ సిందూర్ లాంటి ఎన్నో విజయాలు సాధించవచ్చని గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు వ్యాఖ్యానించారు. ఇతరుల కోసం పనిచేసే వారి జీవితాలు ధన్యమని, తన సోదరుడు, మాజీ మంత్రి పూసపాటి ఆనంద గజపతి ఇందుకు నిదర్శనమన్నారు. ఎంతో పరిణతి చెందిన తన సోదరుడి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకు న్నానన్నారు. ఆనందగజపతి రాజు 75వ జయంతి సందర్భంగా ఆయన కుమార్తె పూసపాటి ఊర్మిళ గజపతిరాజు రచించిన 'ఆనంద గజపతి జీవిత విశేషాల' పుస్తకాన్ని మంగళవారం మహారాణిపేటలోని ఒక హోటల్‌లో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఎన్టీఆర్ తొలి క్యాబినెట్‌లో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఆనంద గజపతిరాజు క్రీడల పట్ల ఆసక్తితో క్రీడా స్థలాలపై తీసుకున్న నిర్ణయం ఎంతో మందికి మేలు చేసిందన్నారు. ఆయన అనేక ధార్మిక కార్యక్రమాలు కూడా చేపట్టి ఆదర్శనీయుడయ్యారన్నారు. తన తండ్రి గురించి ఊర్మిళ ఎంతో పరిశోధన చేసి పుస్త కం తీసుకురావడం మంచి ప్రయత్నమని అభినందించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను నిర్వహించిన పదవులకు వన్నె తెచ్చిన ప్రముఖుడు ఆనంద గజపతిరాజు అన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత ఊర్మిళ తన తండ్రి గొప్పతనంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనంద గజపతి సతీమణి సుధా, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, పార్వతీపురం మాజీ ఎంపీ ప్రదీప్‌చంద్రదేవ్, వీరేష్ చంద్, విద్యాగజపతి, తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి పూసపాటి ఆనంద గజపతిరాజు జీవిత విశేషాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, అశోక్ కుటుంబ సభ్యులు

సీఎస్ఆర్ నిధులతో ఆస్పత్రులు, గృహాల అభివృద్ధి

» జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో జిల్లాలోని ఆస్పత్రులు, సంక్షేమ హాస్టల్స్‌లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, విద్య, సంక్షేమశాఖల అధికారులు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ప్రజలకు తక్షణమే సమకూర్చాల్సిన, అత్యవసర సేవలకు సంబంధించిన నివేదికలను అందించాలని ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, ఛాతి, మెంటల్ కేర్, ప్రభుత్వ కంటి ఆస్పత్రి, ఘోషా, ఈఎన్‌టీ, ఆర్‌సీడీ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు వివిధ అంశాలను కలెక్టర్‌కు నివేదించారు. ప్రహరీలు, ల్యాబ్‌లు, ప్లాట్‌ఫామ్‌లు, ర్యాంపులు, తాగునీటి వసతి కల్పించాల్సి ఉందన్నారు. హైడ్రాలిక్ ఆపరేషన్ టేబుల్స్ ఎల్ఈడీ లైట్లు, లిఫ్టులు, పవర్ బ్యాంక్ సిస్టమ్, సీసీ టీవీ కెమెరాలు, రోడ్లు, పార్కింగ్ షెడ్లు, ఆర్‌వో ప్లాంట్లు, ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చాల్సి ఉందన్నారు.

అనంతరం ప్రాథమిక, ఉన్నత విద్యాశాఖల అధికారులు, సంక్షేమశాఖ అధికారులు వసతి గృహాల్లో ప్రత్యేక తర్ఫీదు ఇచ్చేందుకు, బేసిక్స్ నేర్పించేందుకు ప్రత్యేక ట్యూటర్లను నియమించాలని, క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆస్పత్రులు, వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈఎన్‌టీ ఆస్పత్రికి అంబులెన్స్ కేటాయించాలని కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌ను ఆదేశించారు. ఛాతి, ఈఎన్‌టీ, మెంటల్ కేర్‌లో పీజీ విద్యార్థులకు వర్కింగ్ వుమెన్స్ హాస్టల్‌ను నిర్మిస్తామమన్నారు. కేజీహెచ్‌లో అదనపు డయాలసిస్ యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో ట్యూటర్లను నియమించేందుకు అనుమతులు జారీ చేశారు.

స్వర్ణాంధ్ర సాధనలో భాగస్వాములు కావాలి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్య సాధనలో వైద్య శాఖ అధికారులు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ సూచించారు. ఆయా రంగాల్లో ఉన్న కేపీఐ (కీపెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్స్)లకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తు కార్యాచరణ రూపొందించాలన్నారు. నాణ్యమైన సేవలను అందిస్తూ ఆయా రంగాల్లో పురోగతి సాధించాలన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ల్యాండ్ పూలింగ్‌లో లాభాల కోసమే జగన్ సెంటు స్థలాలు

» 64 వేల మంది నివసించే కాలనీలో వసతులేవీ

» భీమిలి ఎమ్మెల్యే గంటా ధ్వజం

విశాఖపట్నం/ఆనందపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ పూలింగ్ ద్వారా వచ్చే లాభాల కోసమే జగన్ సీఎంగా ఉన్నప్పుడు పేదలకు సెంటు స్థలాల పథకం తీసుకువచ్చారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆరోపించారు. భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం తంగుడుబిల్లిలో 690 ఎకరాల్లో 16,996 మందికి చేపట్టిన సెంటు స్థలాల్లో ఇళ్ల కాలనీని ఆయన మంగళవారం సందర్శించి, నిర్మాణాలను పరిశీలించారు. అక్కడి నుంచే లబ్ధిదారులకు ఫోన్లు చేసి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అన్ని వ్యవస్థలను నాశనం చేసినట్టే గృహ నిర్మాణ శాఖను కూడా జగన్ మోహన్‌రెడ్డి తన స్వార్థం కోసం సర్వనాశనం చేశారని విమర్శించారు. నాలుగేళ్ల క్రితం పనులు ప్రారంభించగా ఇప్పటికి కేవలం 2,036 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయన్నారు. ఒక మునిసిపాలిటీ స్థాయిలో 64వేల మంది నివసించే హౌసింగ్ టౌన్‌షిప్‌లో కనీస మౌలిక వసతులు కల్పించకుండా వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. విశాఖపట్నంలో ఉంటున్న పేదలకు 30 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు కేటాయించడంతో ఎవరూ ఆసక్తి చూపడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం హౌసింగ్‌పై చిత్తశుద్ధితో ఉందని, గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తోందన్నారు. టిడ్కో ఇళ్ల కోసం బ్యాంకు రుణాలు తీసుకున్న లబ్ధిదారులు వాయిదాలు చెల్లించలేకపోతున్నారని, వాటిని పూర్తి చేయకుండా జగన్ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. తంగుడుబిల్లి హౌసింగ్ కాలనీకి కనీస వసతులు కల్పించాల్సిందిగా కలెక్టర్ హరేంధిరప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, ఈపీడీసీఎల్‌తో కలిసి అన్ని పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సత్తిబాబు, ఈఈ సూరిబాబు, ఆనందపురం తహసీల్దార్ సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.




తంగుడుబిల్లిలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

29న కల్యాణం నిర్వహిస్తాం.. ఎవరైనా రావొచ్చు

» వచ్చేది భద్రాచలం ఆస్థాన పండితులు కాదు

» అయోధ్య రామాలయం నమూనా ప్రదర్శన నిర్వాహకులు

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డు పార్క్ హోటల్ పక్కన అయోధ్య రామాలయం సెట్ వేసి, బాలరాముడి విగ్రహం పెట్టి టిక్కెట్ల పేరుతో భక్తులను దోచుకుంటున్న నిర్వాహకులు వారి చర్యలను సమర్థించుకుంటున్నారు. ఈ నెల 29న భద్రాది సీతారాముల దేవస్థానం ఆస్థాన పండితులతో కల్యాణోత్సవం నిర్వహిస్తామని ప్రకటించి, రూ.2,999 చొప్పున టిక్కెట్లు అమ్ముకుంటున్న సంగతి తెలిసిందే. దీనిపై 'సెట్టేసి.. కొట్టేస్తున్నారు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రచురించిన కథనంపై స్పందించారు. మేఘాలయ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఫ్లెక్సీ ప్రింటింగ్‌లో ఆస్థాన పండితులు అని వచ్చిందని, కానీ వారు భద్రాచలానికి చెందిన వారు మాత్రమేనన్నారు. 29న కల్యాణం జరుగుతుందని, ఎవరైనా పాల్గొనవచ్చునన్నారు. టికెట్లకు సంప్రతించాల్సిన నంబర్లు అంటూ రెండు మొబైల్ నంబర్లను కొత్త ఫ్లెక్సీలో వేశారు. కల్యాణోత్సవానికి ఉచితంగా హాజరుకావచ్చని చెబుతూనే దానికి టికెట్ ఎందుకు తీసుకోవాలో ప్రకటించలేదు. సమావేశంలో నిర్వాహక కమిటీ సభ్యుడు వి.దుర్గాప్రసాద్, కొండవీటి రామలింగేశ్వర శర్మ, పీఆర్ఓ వర్మ పాల్గొన్నారు. కల్యాణోత్సవానికి స్పాన్సర్ల కోసం కమిటీ పెద్దలు ప్రయత్నిస్తున్నారు. నమూనా ఆలయం లోపల సుమారు 15 దుకాణాలు ఏర్పాటుచేసి, రూ.లక్షల్లో అద్దె వసూలు చేసినట్టు తెలిసింది. రూ.50 టికెట్ పెట్టి దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీటి సదుపాయం కూడా ఏర్పాటు చేయలేదు. వాటర్ బాటిళ్లు అమ్మేందుకు రూ.లక్షల్లో వసూలు చేశారంటున్నారు. దీనివెనుక బీజేపీ నేతలు ఉండడంతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి ఊరుకున్నారు. కల్యాణోత్సవానికి బీజేపీ పెద్దలను ఆహ్వానించే అవకాశం ఉంది. ఆ రోజున పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలి. ఇంతవరకు పోలీసుల అనుమతి తీసుకోలేదు. బీచ్‌లో ఈ ప్రదర్శనను తక్షణమే నిలిపివేయాలని వాకర్లు డిమాండ్ చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

క్రైం... crime news

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

» నేల బావిలో తేలిన మృతదేహం

పెందుర్తి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం నేల బావిలో తేలింది. ఈ సంఘటన గుర్రమ్మపాలెం పంచాయతీ అక్కిరెడ్డిపాలెంలో మంగళవారం వెలుగుచూసింది. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... అక్కిరెడ్డిపా లెం సమీప నేల బావిలో మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ, సిబ్బంది స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. అప్ప టికే బాగా ఉబ్బి పోయి, ముఖం గుర్తుపట్టలేని విధంగా ఉంది. మృతుడి శరీరంపై లేత ఆకుపచ్చ రంగు బనియన్, నలుపు రంగు షార్ట్ ఉంది. శరీరంపై పలుచోట్ల గాయాలున్నట్టు గుర్తించారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచి, హత్యా, ఆత్మహత్యా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.



సంఘటనా స్థలంలో సీఐ సతీశ్‌కుమార్ విచారణ

ఏఐఎన్‌యూలో అరుదైన శస్త్ర చికిత్స

» తండ్రి కిడ్నీని కుమారుడికి అమర్చిన వైద్యులు



వివరాలు వెల్లడిస్తున్న ఏఐఎన్‌యూ వైద్యులు

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ)లో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ వివరాలను ద్వారకానగర్ మొదటిలైన్‌లో ఉన్న ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంగళవారం వైద్యులు వెల్లడించారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ జి.రవీంద్ర వర్మ మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే క్యాన్సర్ జయించిన తండ్రి తన బిడ్డకు కిడ్నీ దానం చేసి పునర్జన్మను ఇచ్చాడన్నారు. కిడ్నీ డ్యామేజ్ అయి డయాలసిస్ చేయించుకుంటున్న కుమారుడి ప్రాణాలను నిలబెట్టాడన్నారు. ఈ తరహా శస్త్రచికిత్సను తొలిసారి నిర్వహించామని, ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారన్నారు. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స పట్ల అపోహలున్నాయని, వాటిని తొలగించేలా ఆపరేషన్ చేశామన్నారు. లైవ్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు సక్సెస్ రేటు అధికంగా ఉంటుందన్నారు. నెఫ్రాలజీ వైద్యులు డాక్టర్ ఉదయ్ దీపక్‌రావు గజారే మాట్లాడుతూ లక్ష మందిలో ఒకరికి మాత్రమే ఈ తరహా వ్యాధి వస్తుందన్నారు. సమావేశంలో యూరాలజిస్టులు డాక్టర్ అమిత్ చాప్లా, డాక్టర్ పి.శ్రీధర్, డాక్టర్ శ్యామ్ మాట్లాడుతూ టీమ్‌వర్క్‌తో శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. అనంతరం తండ్రీ కుమారులను ఆస్పత్రి వైద్యులు ఘనంగా సత్కరించారు.

పరిశ్రమల్లో ఆటోమేటిక్ అలారం తప్పనిసరి: కలెక్టర్



పరిశ్రమల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినపుడు ఆటోమేటిక్‌గా అలారం మోగే ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, సంస్థల ప్రతినిధులతో భద్రతపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎప్పటికప్పుడు మాక్ డ్రిల్స్ నిర్వహించాలని, కార్మికులు, ప్రజలు తక్షణమే స్పందించేలా చూడాలన్నారు. ప్రమాదాలు జరిగితే తప్పించుకునేలా సిబ్బందికి, కార్మికులకు శిక్షణ ఇవ్వాలన్నారు. పీపీఈ కిట్లు పంపిణీ చేయాలని, అందరికీ బీమా చేయించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఫ్యాక్టరీస్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ సరేశ్, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్ మాథుర్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఆదిశేషు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరోపణలున్న ఉద్యోగితో పార్టీకి విచారణ అధికారి


» ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన బాధితులు

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో పనిచేసే రోగి మిత్రల నుంచి డబ్బులు వసూలు చేశారన్న వ్యవహారంపై అధికారులు విచారణ చేయిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో సూపరింటెండెంట్ విచారణ కమిటీ నియమించారు. ఈ కమిటీ మూడు రోజులు బాధితులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిని విచారించింది. ఆ తరువాత రోజే విచారణ కమిటీలో సభ్యుడిగా ఉన్న అధికారి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారితో పార్టీలో పాల్గొనడంపై ఆరోపణలు వస్తున్నాయి. ఈ పార్టీ కూడా సదరు అధికారి ఇచ్చినట్టు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై మళ్లీ బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినట్టు చెబుతున్నారు. దీనివల్ల తమకు న్యాయం జరగదని, ఏసీబీ, విజిలెన్స్ అధికారులకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.

28, 29 తేదీల్లో జూనియర్ అథ్లెటిక్స్ జట్టు ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో ఈ నెల 28, 29 తేదీల్లో జిల్లా జూనియర్ బాలురు, బాలికల అథ్లెటిక్స్ జట్లు ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎం.నారాయణరావు తెలిపారు. అండర్-14, 16, 18, 20 కేటగిరీలలో జరిగే ఎంపికలలో పాల్గొనేవారు వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. ప్రతి అథ్లెట్ పరిమితంగా రెండు ఈవెంట్లలో మాత్రమే పాల్గొనాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైనవారు వచ్చే నెల 9 నుంచి బాపట్ల జిల్లాలోని చీరాలలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్: 93962 40084, 83094 17921 నందు సంప్రదించాలన్నారు. రాష్ట్ర స్థాయి మీట్‌లో రాణించినవారు సెప్టెంబరు 9 నుంచి పాండిచ్చేరిలో జరిగే సౌత్‌జోన్ జూనియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీకి ఎంపికవుతారని తెలిపారు.

స్టీల్‌ప్లాంటును సందర్శించిన మంత్రి టీజీ భరత్



స్టీల్‌ప్లాంట్ బీఎఫ్ విభాగంలో మంత్రి టీజీ భరత్, అధికారులు, కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్ మంగళవారం స్టీల్‌ప్లాంటులో పర్యటించారు. ఎస్ఎంఎస్, బీఎఫ్, ఆర్ఎంహెచ్‌పీ, సింటర్‌ప్లాంట్, మిల్స్ విభాగాలను పరిశీలించారు. ఉత్పత్తి, ఉత్పాదకత తెలుసుకున్నారు. ప్లాంట్ పరిస్థితి, మైలురాళ్లు, భవిష్యత్తు రోడ్ మ్యాప్‌పై ఉక్కు అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ప్లాంట్‌లో ఉత్పత్తి పెంచడం అభినందనీయమని,ఉద్యోగులు సమష్టి కృషితో భవిష్యత్తు బాగుంటుందని మంత్రి పేర్కొన్నారు. ఆయన వెంట డైరెక్టర్‌లు, అధికారులు, కార్మిక నాయకులు ఉన్నారు.